




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 133 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం బుధవారం 25 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 133 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM WED 25 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## విద్యుత్ భారం పడకుండా
# అప్పులు తీర్చాలి

- ఇంధన శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రజలపై భారం వేయకుండా డిస్కంల అప్పులు తీర్చాలని దిశానిర్దేశం
- విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.4కు తగ్గించాలని సూచన
- ఇంధన రంగంలో ఆవిష్కరణల కోసం ప్రత్యేక ఇంక్యుబేషన్ ఫండ్
- రాష్ట్రంలో ఎనర్జీ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశం



**పెన్ పవర్ డెస్క్:**ప్రజలపై ఎలాంటి అదనపు భారం మోపకుండా విద్యుత్ సంస్థల (డిస్కంల) రుణాలను తీర్చేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.4కు తగ్గించే లక్ష్యంతో పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ఇంధన శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు విద్యుత్ కొనుగోళ్ల ఖర్చు తగ్గింపుపై రూపొందించిన ప్రణాళికను ముఖ్యమంత్రికి వివరించారు. వివిధ సంస్కరణల ద్వారా 2028-29 నాటికి యూనిట్‌పై రూ.1.32 భారాన్ని తగ్గించి, కొనుగోలు ధరను రూ.4.10కి తీసుకురాగలమని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ధరను రూ.4కు తగ్గించేలా చూడాలని సూచించారు. సమర్థ నిర్వహణ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.339 కోట్లు ఆదా చేశామని అధికారులు తెలపగా, పొదుపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు.

**ఇంధన రంగం గేమ్ ఛేంజర్**

"ఉమ్మడి రాష్ట్రంలోనే దేశంలో తొలిసారిగా ఎనర్జీ ఆడిటింగ్ వంటి సంస్కరణలు తెచ్చాం. ఇప్పుడు ప్రపంచం గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తోంది. ఇంధన రంగం భవిష్యత్తులో గేమ్ ఛేంజర్ కానుంది. తక్కువ ఖర్చు, పర్యావరణ హిత విద్యుత్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం కాబట్టే గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చాయి," అని చంద్రబాబు అన్నారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాలను ప్రజలకు, రైతులకు మరింత చేరువ చేయాలని సూచించారు. సోలార్ విద్యుత్‌లో దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలపాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**ఎనర్జీ యూనివర్సిటీ, ఇంక్యుబేషన్ ఫండ్**

రాష్ట్రంలో ఇంధన రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఒక 'ఎనర్జీ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు స్టార్టప్‌లకు ఆర్థిక చేయూతనిచ్చేలా 'ఇంక్యుబేషన్ ఫండ్' ఏర్పాటు చేయాలని సూచించారు. "మన విద్యుత్ సంస్థలు ఇతర రాష్ట్రాలకు కన్సల్టెన్సీ సేవలు అందించే స్థాయికి ఎదగాలి. ఇప్పటికే ట్రూ అప్ భారాన్ని ప్రజలపై వేయలేదు, పైగా 13 పైసల మేర ట్రూడౌన్ చేశాం. కొనుగోలు భారాన్ని కూడా తగ్గిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పురుషులకూ ఉచిత బస్సు ప్రయాణం
### అన్నాడీఎంకే మేనిఫెస్టో విడుదల

- రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచితంగా ఫ్రిజ్‌లు ఇస్తామని హామీ
- మహిళా ఉద్యోగులకు రాయితీతో ద్విచక్ర వాహనాలు అందిస్తామని ప్రకటన
- విద్యా రుణాలు మాఫీ చేస్తామని హామీ

**పెన్ పవర్ డెస్క్:**తాము అధికారంలోకి వస్తే పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి ఉచితంగా ఫ్రిజ్ ఇస్తామని అన్నాడీఎంకే తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికలు

- మిగతా2లో

## మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం

- ఉత్తరాంధ్రలో రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్
- ఈ పరిశ్రమతో ఉక్కు రంగంలో అగ్రస్థానానికి ఏపీ
- ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఇది సాధ్యమైందన్న సీఎం చంద్రబాబు
- గతంలో కబ్జాలు, భయం.. నేడు అభివృద్ధి, భవిష్యత్‌పై భరోసా కల్పించామన్న సీఎం
- ఈ ప్లాంట్‌తో లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో ప్రతిష్ఠాత్మకమైన ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు నిన్న అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద శంకుస్థాపన జరగడం తెలిసిందే. దీనిపై సీఎం చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఓ దిక్సూచి అని అభివర్ణించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ సాధ్యమైందంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. "మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం. ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రతీ రంగంలో, ప్రతీ ప్రాంతంలో మార్పు తెచ్చి చూపిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ రాకతో గొప్ప ముందడుగు వేశాం. 21 నెలల క్రితం కబ్జాలు,

- మిగతా2లో



## మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు లొంగుబాటు

- బస్తర్‌లో కీలక పరిణామం
- పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు కమాండర్ పాపారావు
- ఆయుధాలతో పాటు 17 మంది అనుచరుల లొంగుబాటు
- బస్తర్‌లో సాయుధ నక్సలిజం అంతమైందన్న ప్రభుత్వం
- ఇక ఇద్దరు అగ్రనేతలు మాత్రమే మిగిలారన్న హోం మంత్రి

**పెన్ పవర్ డెస్క్:**ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌ను నక్సల్ రహితంగా మారుస్తామని ప్రభుత్వం విధించుకున్న గడువుకు వారం రోజుల ముందే ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది.

- మిగతా2లో




## ఆ సబ్జెక్ట్ గురించి మంత్రి నారా లోకేశ్ గారికి విజ్ఞప్తి చేశాను

- కుప్పం విలువల బడి కార్యక్రమంలో పాల్గొన్న నారా భువనేశ్వరి
- నాన్న వీధిదీపాల కింద చదివారు, చంద్రబాబు కిలోమీటర్లు నడిచారని వెల్లడి
- పిల్లలకు సెల్ ఫోన్లు అధికంగా ఇవ్వొద్దు, టెక్నాలజీ అవసరానికే వాడాలని సూచన
- అహంభావం వద్దు, తల్లిదండ్రులను గౌరవించాలని విద్యార్థులకు హితవు

**పెన్ పవర్ డెస్క్:**విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పించడం ఎంతో కీలకమని సీఎం చంద్రబాబు అర్ధాంగి, హెరిటేజ్ ఫుడ్స్ అధినేత నారా భువనేశ్వరి అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం పైపాల్యం గ్రామంలో మంగళవారం జరిగిన 'విలువల బడి' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో

- మిగతా2లో

## అమరావతిలో అగ్నిప్రమాదాల వెనుక కుట్ర?
### రాయపూడి ఘటనపై సీఎం చంద్రబాబు హైలెవల్ రివ్యూ!



- మొన్న రాత్రి రాయపూడిలోని హెచ్‌వోడీ టవర్ల ప్రాంతంలో అగ్నిప్రమాదం
- మేఘా సంస్థకు చెందిన భారీ ప్లాస్టిక్ పైపులు ఆహుతి
- ఇప్పటి వరకు ఇలాంటి ఘటనలు మూడు జరిగాయన్న అధికారులు
- ఉద్దేశ పూర్వకంగా చేశారేమో అని అనుమానాలు

- మిగతా2లో

## ట్రంప్ ఫోన్ చేశారు.. శాంతి దిశగా చేపట్టే చర్యలకు భారత్ సహకరిస్తుందని చెప్పాను

- పశ్చిమాసియా పరిస్థితులపై చర్చ జరిపినట్లు వెల్లడి
- ఉద్రిక్తతలు తగ్గించి, శాంతిని పునరుద్ధరించడానికి భారత్ మద్దతు ఇస్తుందని ప్రకటన
- హర్మ్యూజ్ జలసంధిని తెరిచి ఉంచడం ప్రపంచ దేశాలకు అవసరమన్న మోదీ



**పెన్ పవర్ డెస్క్:**హర్మ్యూజ్ జలసంధిని తెరిచి సురక్షితంగా, అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ప్రపంచం మొత్తానికి అత్యవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు ఫోన్ చేసి సంభాషించినట్లు వెల్లడించారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై ఉపయోగకరమైన రీతిలో తమ మధ్య చర్చ

- మిగతా2లో

## ఇప్ప పువ్వు సారాతో రూ. లక్ష కోట్ల ఆదాయం.. అసెంబ్లీలో పూర్తి వివరాలు చెబుతా



- ఇప్ప పువ్వు సారా తాగిన వారు 115 ఏళ్లు బతికారన్న అనిరుధ్ రెడ్డి
- ఇప్ప పువ్వు సారాను శాస్త్రీయంగా ఉత్పత్తి చేస్తే రూ. లక్ష కోట్ల రెవెన్యూ వస్తుందన్న ఎమ్మెల్యే
- విదేశాలకు కూడా ఎగుమతి చేయొచ్చని సూచన

**పెన్ పవర్ డెస్క్:**ఇప్ప పువ్వు సారాపై తనకున్న అవగాహనను తక్కువ అంచనా వేయవద్దని, దీనిపై అసెంబ్లీ వేదికగా రేపు పూర్తి వివరాలు వెల్లడిస్తానని కాంగ్రెస్ పార్టీ జడ్చర్ల ఎమ్మెల్యే

- మిగతా2లో

## ఏపీకి మిట్టల్ స్టీల్ ప్లాంట్ రావడానికి జగనే కారణం

- దావోస్ లో ఆదిత్య మిట్టల్ తో జగన్ చర్చలు జరిపారన్న గుడివాడ
- నక్కపల్లి వద్ద వేల ఎకరాల భూమిని కూడా చూపించామని వెల్లడి
- జగన్ వ్యక్తిత్వాన్ని కించపరచవద్దని షర్మిలకు సూచన

- మిగతా2లో




## ధర్మ రక్షణకు శంకరాచార్యుల 'చతురంగిణి సేన'.. 2 లక్షల మందితో సైన్యం!

- 2.18 లక్షల మందితో సైన్యం.. కుల, లింగ భేదం లేకుండా అందరికీ ప్రవేశం
- వచ్చే ఫిబ్రవరిలో ప్రయాగ్‌రాజ్‌లో సైన్యాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడి
- శంకరాచార్యుల ప్రకటనపై దృష్టి సారించిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం
- ఆయుధాల ప్రదర్శనపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**జ్యోతిష్పీఠం శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సంచలన ప్రకటన చేశారు. హిందూ ధర్మం, గోవుల రక్షణ కోసం 2 లక్షల 18 వేల మంది సైనికులతో 'చతురంగిణి సేన'ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వారణాసిలో ఆయన ఈ ప్రకటన చేశారు. కుల, మత, లింగ భేదాలు లేకుండా ఎవరైనా ఈ సైన్యంలో చేరవచ్చని

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త గోవారికర్

భారత దేశం గర్వించదగిన శాస్త్రవేత్తలలో గోవారికర్ ప్రముఖులు. ఆయన అంతరిక్ష రంగంలో మరిచి పోలేని విశేష పరిశోధనలు చేసారు. భారత దేశంలో సైన్స్, టెక్నాలజీ శాఖ కార్యదర్శిగా,1991-1993 మధ్యకాలంలో అప్పటి భారత ప్రధాని దివంగత పి.వి.నరసింహారావుకు శాస్త్రీయ సలహాదారుగా వ్యవహరించారు. భారత మాన్సూన్ నమూనా పితామహుడిగా పేరు గాంచిన ఆయన తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో వాతావరణ మార్పులను సూచించే వ్యవస్థను రూపొందించిన తొలి శాస్త్రవేత్త. ఆయన ఇస్రో కు ఛీఫ్ గా తన సేవలందించారు. వాతావరణం, జనాభా రంగాలలో కూడా తన సేవలనందించారు. 'పద్మశ్రీ, పద్మ భూషణ్ అవార్డుల గ్రహీత. వసంత్ రాంచోండ్ గోవారికర్ (1933 మార్చి 25 - 2015 జనవరి 2) పూణేలో లో ఒక బ్రాహ్మణ కుటుంబంలో మార్చి 25, 1933 న జన్మించారు. తరువాత ఆయన మహారాష్ట్ర లోని కోల్హాపూర్ జిల్లాలో ప్రారంభ విద్య, గ్రాడ్యుయేషన్ చేసారు.1950ల ప్రారంభంలో పరిశోధనల నిమిత్తం ఇంగ్లాండు వెళ్లారు. ఆయన ఎం.ఎస్.సి, కెమికల్ ఇంజనీరింగ్ లో పి.హెచ్.డి లను డా.ఎఫ్.హెచ్.గార్నర్ అధ్వర్యంలో చేసారు. ఆయన పరిశోధనల ఫలితం "గార్నర్-గోవారికర్ సిద్ధాంతం". ఈ సిద్ధాంతం ఘన పదార్థాల నుండి ప్రవాహులకు ఉష్ణము, ద్రవ్యరాశిల బదిలీ గూర్చి విశ్లేషణ చేయబడిన గ్రంథము. 1959 నుండి 1967 వరకు ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో, ఆయన మొదట హార్వెల్‌లోని (బ్రిటిష్) అటామిక్ ఎనర్జీ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో, తరువాత సమ్మర్ ఫీల్డ్‌లో పనిచేశారు. ఈ సంస్థ రాకెట్ మోటారుల ఉత్పత్తిలో పేరెన్నిక గన్నది. ఆయన ఆక్స్ఫర్డ్ తో పాటు కేంబ్రిడ్జ్ ఎగ్జామినేషన్ బోర్డ్ యొక్క ఎగ్జామినర్స్ బయటి ప్యానెల్ సభ్యుడిగా మరియు పెర్గామోన్ యొక్క బాహ్య సంపాదకీయ సిబ్బందిగా కూడా పని చేశారు. అక్కడ అనేక శాస్త్రీయ పుస్తకాలను సవరించడంలో సహాయం చేశారు. డాక్టర్ విక్రమ్ సారాభాయ్ సారథ్యంలో, డాక్టర్ గోవారికర్ 1967 లో తిరువనంత పురంలోని తుంబాలోని అంతరిక్ష కేంద్రంలో ప్రొపెల్లెంట్ ఇంజనీర్‌గా చేరారు. తరువాత ఈ కేంద్రం ఇతర అంతరిక్ష పరిశోధన సంస్థలతో కలిసి 1972 లో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వి.ఎస్.ఎస్.సి) గొడుగు కిందకు వచ్చింది. డాక్టర్ గోవారికర్ 1973 లో కెమికల్స్ అండ్ మెటీరియల్స్ గ్రూప్ డైరెక్టర్ అయ్యారు, చివరకు 1979 లో సెంటర్ డైరెక్టర్ అయ్యారు. 1985 వరకు ఆ పదవిలో కొనసాగారు.1994 - 2000 మధ్య మరాఠీ విజ్ఞాన్ పరిషత్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. భారత దేశంలో మొట్ట మొదటి ప్రయోగ వాహనం ఎస్ఎల్వి 3, వి.ఎస్.ఎస్.సి డైరెక్టర్ గా ఉన్న కాలంలో విజయ వంతమైన విజయాన్ని సాధించింది. భారత దేశం యొక్క ప్రయోగ వాహనాల కోసం క్లిష్టమైన ఘన ఇంధన సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా స్వదేశీగా... అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చడంలో డాక్టర్ గోవారికర్ వృత్తి పరమైన నాయకత్వాన్ని అందించారు. ఇస్రో సంబంధిత 'సాలిడ్ ప్రొపెల్లెంట్ స్పేస్ బూస్టర్ ప్లాంట్' అయన నాయకత్వంలో 5,500 ఎకరాలకు పైగా భూమిని ఏర్పాటు చేశారు. ఆయన అంతరిక్ష పరిశోధన, వాతావరణ అంచనా, ఇతర అంశాల పై పరిశోధనలు చేశారు. గోవారికర్ యూకే అటామిక్ ఎనర్జీ అథారిటీలో కూడా పనిచేశారు. ఆయన శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా పనిచేశారు. ఆయన 1995 నుండి 1998 మధ్య పూణే విశ్వ విద్యాలయ ఉపకులపతిగా పనిచేశారు. ఆయన దేశంలోని మొట్టమొదటి రుతుపవనాల సూచన నమూనా వెనుక ఉన్న వ్యక్తి అయినందున 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ మాన్‌సూన్ మోడల్' గా ప్రసిద్ధి చెందారు. 1988 నుండి, ప్రభుత్వ వాతావరణ శాస్త్రవేత్తలు ఈ నమూనాను గోవారికర్ పేరు పెట్టారు. చాలా ఖచ్చితమైన రుతుపవనాల అంచనాలను ముందుగానే ఉపయోగిస్తున్నారు. పౌర సరఫరా, పంట పద్ధతులు, చమురు విత్తనాల దిగుమతి రంగాలలో తగిన సర్దుబాట్లు చేయడానికి ప్రణాళిక దారులకు ఈ నమూనా చాలా సహాయకారిగా నిరూపించ బడింది.దేశ ఉపగ్రహ పరిశోధన కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రఖ్యాత శాస్త్రవేత్తల బృందంలో ఎపిజె కలాం, ఇ.వి. చిట్నిస్, ప్రమోద్ కాలే, యు.ఆర్. రావు వంటి వారి బృందంలో గోవారికర్ ఉన్నారు. ఆయనకు భారత దేశంలో ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ 1984 లో, పద్మభూషణ్ 2008 లో వచ్చాయి. ఆయన జనవరి 2 2015 శుక్రవారం నాడు పుణేలోని దీనానాథ్ మంగేష్కర్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు.

# అమరావతిలో అగ్నిప్రమాదాల వెనుక కుట్ర?

రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం అవుతున్న తరుణంలో, వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. నిన్న రాత్రి రాయపూడిలోని హెచ్‌వోడీ టవర్ల నిర్మాణ ప్రాంతంలో మేఘా సంస్థకు చెందిన భారీ ప్లాస్టిక్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనపై ఈరోజు సచివాలయంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... ఇది కేవలం ప్రమాదమా లేక ఎవరైనా కావాలని చేస్తున్న కుట్రనా అనే కోణంలో సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు.

**సీఎం చంద్రబాబు వ్యక్తం చేసిన ప్రధాన సందేహాలు:**

రాజధాని ప్రాంతంలో గత కొద్ది రోజులుగా మూడు సార్లు ఇలాంటి ప్రమాదాలు జరగడం యాదృచ్ఛికం కాదని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ కాంట్రాక్టు సంస్థలకు చెందిన కోట్లాది రూపాయల విలువైన నిర్మాణ సామగ్రి కాలిపోవడం వెనుక ఏదైనా లోతైన కుట్ర ఉందేమో తేల్చాలని చెప్పారు. వెలగపూడి సీడ్ యాక్సిస్ రోడ్ వద్ద కూడా గతంలో ఇలాగే పైపులు అగ్నికి ఆహుతయ్యాయని, ఇప్పటి వరకు ఇలాంటి ఘటనలు మూడు జరిగాయని, ఇది ఉద్దేశపూర్వక చర్యగా కనిపిస్తోందని అధికారులు ప్రాథమిక సమాచారం అందించారు.

ఈ రోజు సాయంత్రం సీఆర్డీఏ అధికారులు, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాజధాని ప్రాంతంలో సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేసేలా ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**రాయపూడిలో అసలేం జరిగింది?**

అఖిల భారత సర్వీస్ అధికారుల (IAS/IPS) కోసం నిర్మిస్తున్న నివాస సముదాయాల సమీపంలో నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా తగులబడ్డాయి. ఆకాశాన్ని అంటేలా ఎగిసిపడిన మంటలను చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగి మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది.

# ఏపీకి మిట్టల్ స్టీల్ ప్లాంట్ రావడానికి జగనే కారణం

అనకాపల్లి జిల్లాలో నక్కపల్లికి అర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రావడానికి అసలు కారణం వైసీపీ అధినేత జగన్ అని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. దావోస్ పర్యటనలో ఆదిత్య మిట్టల్‌తో జగన్ జరిపిన చర్చల ఫలితంగానే ఈ భారీ ప్రాజెక్టు పట్టాలెక్కిందని గుర్తుచేశారు. ఆదిత్య మిట్టల్ కోరిన విధంగానే నక్కపల్లి వద్ద 4 వేల ఎకరాల భూమిని చూపించామని, ఎన్నికల నోటిఫికేషన్ సమయంలోనే దీనిపై స్పష్టత వచ్చిందని ఆయన వివరించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి కొత్తగా వచ్చిన పరిశ్రమలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. జగన్ హయాంలో వచ్చిన బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం ఇప్పటికీ పూర్తి చేయలేకపోవడంపై ఆయన విమర్శలు గుప్పించారు. 35 వేల మందికి ఉపాధి కల్పించాల్సిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం అయోమయంలో పడిందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గడిచిన కాలంలో సుమారు రూ. 6,500 కోట్ల పెట్టుబడులు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని ఆయన ఆరోపించారు.

ఇదే క్రమంలో వైఎస్ షర్మిల చేస్తున్న ఆరోపణలపై అమర్‌నాథ్ తీవ్రంగా స్పందించారు. "మీ రాజకీయ అవసరాల కోసం జగన్ వ్యక్తిత్వాన్ని కించపరచకండి. ఎవరి చేతిలోనూ రాజకీయ పావుగా మారకండి" అని హితవు పలికారు. షర్మిల వ్యాఖ్యల వల్ల వైసీపీ కార్యకర్తల నుంచి తమపై ఒత్తిడి పెరుగుతోందని, ఇప్పటివరకు జగన్ తమను కట్టడి చేస్తున్నారని చెప్పారు. ఒకవేళ హద్దు మీరితే మాత్రం మిగతా రాజకీయ పార్టీ నాయకులకు ఎలా సమాధానం చెబుతామో, ఆమెకు కూడా అలాగే బదులిస్తామని హెచ్చరించారు.

# పురుషులకూ ఉచిత బస్సు ప్రయాణం

- మొదటి పేజి తరువాయి

దగ్గరపడుతున్న నేపథ్యంలో డీఎంకే, టీవీకే పార్టీలు వరుసగా తమ మేనిఫెస్టోలను ప్రకటిస్తున్నాయి. తాజాగా అన్నాడీఎంకే తన ఎన్నికల హామీలను విడుదల చేసింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉచితంగా ఫ్రిజ్‌లు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. మహిళలతో పాటు పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపింది. 5 లక్షల మంది మహిళా ఉద్యోగులకు రూ.25 వేల రాయితీతో ద్విచక్ర వాహనాలు అందిస్తామని ప్రకటించింది. బ్యాంకుల నుంచి తీసుకున్న విద్యా రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం ఇస్తామని తెలిపింది. రేషన్ కార్డు ఉన్న వారికి బియ్యంతో పాటు ఉచితంగా కిలో పప్పు, కిలో మంచినూనె అందజేస్తామని తన మేనిఫెస్టోలో పేర్కొంది. సంవత్సరానికి ఒక కుటుంబానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, సామాజిక భద్రతా పెన్షన్ రూ.2 వేలకు పెంపు, జల్లికట్టు యోధుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం వంటి హామీలను కూడా పొందుపరిచింది.

# మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు లొంగుబాటు

- మొదటి పేజి తరువాయి

బస్తర్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న చివరి అగ్రశ్రేణి మావోయిస్టు కమాండర్ పాపారావు అలియాస్ సున్నం చంద్రయ్య అలియాస్ మంగు తన సాయుధ బృందంతో సహా పోలీసులకు లొంగిపోయాడు. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. 56 ఏళ్ల పాపారావు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో సీనియర్ సభ్యుడు. ఇతను బీజాపూర్ జిల్లాలోని కుట్రు పోలీస్ స్టేషన్‌లో 17 మంది అనుచరులతో (10 మంది పురుషులు, 8 మంది మహిళలు) కలిసి లొంగిపోయాడు. వీరి నుంచి 8 ఏకే-47 రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ రైఫిల్‌ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పాపారావు తలపై రూ.2 కోట్ల రివార్డు ఉంది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత బస్తర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్‌గా పాపారావు ఉన్నాడు. అతడిపై 50 కేసుల వరకు ఉన్నాయి. సుక్మా జిల్లా కలెక్టర్ ను కిడ్నాప్ చేసిన ఘటనలోనూ, గతంలో 76 మంది భద్రతా సిబ్బందిని బలిగొన్న ఘటనలోనూ పాపారావు హస్తం ఉందని భావిస్తున్నారు.

ఈ విషయాన్ని ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ ధృవీకరించారు. పాపారావు లొంగుబాటుతో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో ఇక క్రియాశీల సభ్యులెవరూ లేరని ఆయన తెలిపారు. లొంగిపోయే ముందు తాను పాపారావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. రాష్ట్రం వెలుపల కేవలం ఇద్దరు అగ్ర నేతలు మిషిర్ బెస్రా, గణపతి మాత్రమే మిగిలి ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. పాపారావు లొంగుబాటుతో బస్తర్‌లో సాయుధ నక్సలిజం పూర్తిగా అంతమైందని ప్రభుత్వం ప్రకటించింది.అయితే, ఈ పరిణామంపై రాష్ట్ర కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. గడువు ముగిసిన తర్వాత అమాయక ఆదివాసులపై వేధింపులు పెరిగే ప్రమాదం ఉందని, వారిపై నక్సలైట్లు అనే ముద్ర వేసి అరెస్టులు చేయవచ్చని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్ హెచ్చరించారు. బస్తర్ సహజ వనరులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే ప్రమాదం కూడా ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

## ఇప్ప పువ్వు సారాతో రూ. లక్ష కోట్ల ఆదాయం..

# అసెంబ్లీలో పూర్తి వివరాలు చెబుతా

- మొదటి పేజి తరువాయి

అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్ చేసిన ఆయన, తనపై వస్తున్న సోషల్ మీడియా ట్రోల్స్‌కు తన ప్రసంగమే సమాధానం చెబుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం వినోదం కోసం కాకుండా, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మార్చే శక్తి ఇప్ప పువ్వుకు ఉందని అన్నారు.

గతంలో ఇప్ప పువ్వు సారా తాగిన వారు 115 ఏళ్లు ఆరోగ్యంగా బతికారని, కానీ ప్రస్తుతం వస్తున్న కల్తీ బ్రాండ్ల వల్ల ప్రజలు 60 ఏళ్లకే ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్ప పువ్వు సారాను శాస్త్రీయంగా ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేస్తే, రాష్ట్రానికి ఏకంగా రూ. లక్ష కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని ఆయన లెక్కలు వేశారు. దీనిని విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా గ్లోబల్ బ్రాండ్‌గా మార్చవచ్చని కూడా సూచించారు. అడవుల్లో ఇప్ప పువ్వు సేకరించే గిరిజన సోదరులు ఆర్థికంగా ఎదగాలంటే, ఇప్ప పువ్వు సారాకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు.రేపు శాసనసభలో ఇప్ప పువ్వు సారా విధానంపై తాను ప్రసంగించబోతున్నానని, ఈ సారా తయారీ వెనుక ఉన్న శాస్త్రీయత, ఆర్థిక లాభాలను గణాంకాలతో సహా వివరిస్తానని అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ట్రోల్స్ చేసే వారు తన ప్రసంగం విన్నాక అభిప్రాయం మార్చుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మాట ఇచ్చాం... మార్పు తెచ్చాం

- మొదటి పేజి తరువాయి

కూల్చివేతలు, కేసులతో అభద్రత, భయం, మానసిక క్షోభతో అల్లాడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో... నేడు అభివృద్ధి, అవకాశాలు, ఆకాంక్షలతో అన్ని చోట్లా ఆనందాన్ని, భవిష్యత్ పై భరోసాను తీసుకువచ్చాం. ఆంధ్రుల హక్కు అని పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ మన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిస్తే... ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు అవుతున్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పరిశ్రమ ఉత్తరాంధ్ర భవిష్యత్‌కు నూతన దిక్సూచి అవుతుంది. రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏర్పాటు అవుతున్న ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్రను ఉక్కు ఆంధ్రాగా మారుస్తుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో ఉక్కు రంగంలో ఏపీ దేశంలో అత్యున్నత స్థానానికి చేరుకుంటుంది. గౌరవ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లనే 21 నెలల్లో ఇంత పెద్ద ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. ప్లాంట్‌కు అవసరమైన ముడి ఖనిజం సరఫరా నుంచి అనుమతుల వరకు కేంద్రం వేగవంతమైన, సానుకూల నిర్ణయాలతో ప్రతి దశలోనూ ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. డబుల్ ఇంజన్ సర్కారు ప్రగతిశీల నిర్ణయాల వల్లనే ఈ ప్రాంతంలో ఒక స్టీల్ సిటీ నిర్మితమవుతోంది. యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయి. వచ్చే మూడేళ్లలోనే ఈ ప్రాంతంలో అన్ని రంగాల్లో, అన్ని విధాలా అభివృద్ధి ఫలాలు అందుతాయి. భారతదేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్‌కు అడుగులు పడిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు శుభాకాంక్షలు" అంటూ సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## ధర్మ రక్షణకు శంకరాచార్యుల 'చతురంగిణి సేన'..

# 2 లక్షల మందితో సైన్యం!

- మొదటి పేజి తరువాయి

ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మౌని అమావాస్య సందర్భంగా ఈ సైన్యాన్ని అధికారికంగా ప్రారంభిస్తామని శంకరాచార్యులు తెలిపారు. మహాభారత కాలం నాటి తరహాలో పదాతి, అశ్వ, గజ, రథ బలాలతో ఈ సైన్యం ఉంటుందని వివరించారు. ఈ సేన సభ్యులకు సాంప్రదాయ, ఆధునిక ఆయుధాలతో శిక్షణ ఇస్తామని చెప్పారు. ధర్మం, సంస్కృతి, సమాజాన్ని కాపాడటమే ఈ సేన ముఖ్య బాధ్యత అని ఆయన అన్నారు. ప్రకటన సమయంలో ఆయన, ఆయన అనుచరులు గొడ్డలి నమూనాలను చేతపట్టుకుని కనిపించారు. ఈ సైన్యంలో చేరేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని శంకరాచార్యులు పునరుద్ఘాటించారు. హిందూ సమాజంలోని అన్ని కులాల వారితో పాటు స్త్రీలు, పురుషులు, తృతీయ లింగానికి చెందిన వారు కూడా ఇందులో భాగం కావచ్చని పిలుపునిచ్చారు. అయితే, శంకరాచార్యుల ప్రకటనపై ఉత్తరప్రదేశ్ యంత్రాంగం దృష్టి సారించింది. లైసెన్సు లేని ఆయుధాలను కలిగి ఉండటం లేదా బహిరంగంగా ప్రదర్శించడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఇటీవల మాఘ మేళా సందర్భంగా తనను సంగమ్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారని శంకరాచార్యులు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను విమర్శించిన విషయం తెలిసిందే. గతంలో ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం కూడా గమనార్హం. మొత్తం మీద, శంకరాచార్యుల ఈ ప్రకటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఆ సబ్జెక్ట్ గురించి మంత్రి నారా లోకేశ్ గారికి విజ్ఞప్తి చేశాను

- మొదటి పేజి తరువాయి

ముచ్చటిస్తూ, తన తండ్రి ఎన్టీఆర్, భర్త చంద్రబాబుల బాల్యంలోని కష్టాలను గుర్తుచేసుకుంటూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఉన్నత స్థానాలకు చేరడానికి వారు పడిన శ్రమను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి మాట్లాడుతూ, "విద్యార్థులను చూస్తే నాకు ఎంతో సంతోషంగా ఉంటుంది. మా చిన్నప్పుడు 'మోరల్ సైన్స్' అనే సబ్జెక్ట్ ఉండేది. కానీ కాలక్రమేణా దాన్ని తీసేశారు. పాఠశాలల్లో ఆ సబ్జెక్ట్‌ను తిరిగి ప్రవేశపెట్టాలని మంత్రి నారా లోకేశ్ గారికి ఇప్పటికే విజ్ఞప్తి చేశాను" అని తెలిపారు. తన తండ్రి ఎన్టీఆర్ గురించి చెబుతూ, "మా నాన్నగారు ఓ పేద కుటుంబంలో పుట్టి, కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. చిన్నప్పుడు సైకిల్‌పై ఇల్లిల్లూ తిరిగి పాలు అమ్మేవారు. వీధిదీపాల కింద కూర్చొని చదువుకున్నారు" అని భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు.అదేవిధంగా, తన భర్త చంద్రబాబు నాయుడు కూడా చిన్నతనంలో కిలోమీటర్ల దూరం నడిచి బడికి వెళ్లేవారని, వారు ఎదిగిన తీరు తనకు గర్వకారణంగా ఉంటుందని పేర్కొన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర అత్యంత కీలకమని, తన తల్లి తమకు విలువలు నేర్పి పెంచిందని వివరించారు.

ఆధునిక టెక్నాలజీ వినియోగంపై ఆమె కీలక సూచనలు చేశారు. "పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వకూడదు. ఒకే ఇంట్లో ఉండి కూడా కుటుంబ సభ్యులకు ఫోన్లలో మెసేజ్‌లు పంపుకునే పరిస్థితి వచ్చింది. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడుకోవాలి. మా చిన్నతనంలో ఫోన్లు, టీవీలు లేకపోవడం వల్లే సంతోషంగా గడిపామనిపిస్తుంది" అని అన్నారు. 'అన్నీ మాకే తెలుసు' అనే అహంభావం ఎవరికీ ఉండకూడదని, అహంకారం మనల్ని పాతాళానికి నెట్టేస్తుందని హితవు పలికారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవ్వడంతో మనుషుల మధ్య దూరం పెరిగిపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# ట్రంప్ ఫోన్ చేశారు.. శాంతి దిశగా చేపట్టే చర్యలకు భారత్ సహకరిస్తుందని చెప్పాను

- మొదటి పేజి తరువాయి

జరిగిందని తెలిపారు. ఈ అంశంపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించడానికి భారతదేశం మద్దతు ఇస్తుందని ట్రంప్‌కు చెప్పినట్లు పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిచి ఉంచడం, రక్షణ కల్పించడం ప్రపంచ దేశాలకు అత్యవసరమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. శాంతి, సుస్థిరం దిశగా చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ అండగా నిలుస్తుందని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు.ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య గత 24 రోజులుగా జరుగుతున్న యుద్ధానికి, ట్రంప్ నిన్న తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఐదు రోజుల పాటు ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తదుపరి చర్చల ఫలితాలను బట్టి నిర్ణయం ఉంటుందని అన్నారు. యుద్ధానికి తాత్కాలికంగా విరామం ప్రకటించిన మరుసటి రోజే ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ కాల్ చేయడం గమనార్హం.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని సతీసమేతంగా కలిసిన రఘురామ్

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 24:**మంగళవారం ఉదయం తాడేపల్లి నివాసం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని సతీసమేతంగా కలిసిన తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జి వడ్డీ రఘురాం నాయుడు , శ్రీమతి వడ్డీ సుధా మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గం పార్టీ బలోపేతం గురించి మరియు డిజిటలిజేషన్ గురించి చర్చించారు



## క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ




**కూనవరం,పెన్ పవర్,మార్చి 24.**ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మండలంలోని కూటురు,కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది,మెడికల్ అధికారి ధనుసూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని,అదేవిధంగా క్షయ వ్యాధి లేని సమాజాన్ని నిర్మించాలని ప్రతిజ్ఞ చేశారు.రెండు వారాల పైగా దగ్గు,నీరసం,రాత్రి సమయంలో జ్వరం రావడం, బరువు తగ్గడం,దగ్గినప్పుడు కళ్లె పడటం మొదలగు లక్షణాలు ఉన్నవాళ్లు వెంటనే కళ్ళే పరీక్ష చేయించుకోవాలని అన్నారు.క్షయ వ్యాధి వచ్చిన వ్యక్తి పూర్తి మందులు వాడి తగ్గించు కోవాలని, మందులను మధ్యలోఆపకూడదని డాక్టర్ రాజీవ్,డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు.ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం



డాక్టర్,నిరంజన్,కుమార్,వైద్యశాల సిబ్బంది.

**వి.ఆర్.పురం పెన్.పవర్.మార్చి.24:**మండలంలోని జీడిగుప్ప ప్రభుత్వ వైద్యశాల పరిధిలోనిజీడిగుప్ప,చొక్కనపల్లి,శ్రీరామగిరి, సీతంపేట,మట్నుద్దుగూడెం,తదితరగ్రామాల్లో మంగళవారంజీడిగుప్ప వైద్యశాల డాక్టర్, నిరంజన్,కుమార్,ప్రభుత్వవైద్యశాల సిబ్బంది. ఆద్వర్యంలోప్రపంచ క్షయవ్యాధి కార్యక్రమాన్ని ర్యాలీగానిర్వహించి,టి.బి. వ్యాధిగురించి,రహ దారిపైమనపంతంటి.బి.అంతం,రెండువరాలు మించినదగ్గు,టి. బి.కావచ్చు,టి.బి.అంటే భయం వద్దు,చికిత్సముద్దు,టి.బి.వ్యాధినీచెంత,కృగిపోకు రవ్వంత వేయించుకో,బి.సి.జి.టీకా నిరోధించుదాం, టి.బి.రాకుండాచూసుకుందాంఅంటూ నినాదాలు చేస్తూ,టి.బి.వ్యాధిపై మండలప్రజలకు అవగాహణ కల్పించారు.ఈ సందర్భంగా జీడిగుప్పప్రభుత్వవైద్య శాలడాక్టర్,నిరంజన్,కుమార్,మాట్లాడుతూ జర్మన్, శాస్త్రవేత్త డాక్టర్,రాబర్ట్ కోచ్,1882వ.సంవత్సరంలో బాక్టీరియం(మైకోబాక్టీరియం క్షయవ్యాధి)క్షయవ్యాధికు కారణంఅవుతుందని,గుర్తించి,మార్చి 24వ.తారీకురోజు నప్రపంచ క్షయవ్యాధి,దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జరుపుకోవడం జరుగుతుందని,అన్నారు.ఈ కార్యక్ర మంలోవైద్యశాల సిబ్బంది.ఆశాలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పామ్ ఆయిల్ మిల్లుల
## ఆధునికీకరణకు కేంద్రం చర్యలు తీసుకోవాలి



**- ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి విజ్ఞప్తి**


**రాజమహేంద్రవరం పెన్ పవర్, మార్చి 24:**దగ్గుబాటి పురందేశ్వరి పార్లమెంట్ లో అత్యవసర ప్రజా ప్రాధాన్యత గల అంశంగా ఆంధ్రప్రదేశ్లో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఆధునికీకరణ అవసరాన్ని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిమంగళవారం కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు.
దేశంలోనే రాష్ట్రం లో అత్యధిక పామ్ ఆయిల్ సాగు సుమారు 2.49 లక్షల హెక్టార్లలో పామ్ ఆయిల్ సాగు జరుగుతుండగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 1.97 లక్షల మంది రైతులకు ఉపాధి కల్పిస్తోందన్నారు. పామ్ ఆయిల్ దీర్ఘకాలిక వాణిజ్య పంటగా దేశీయ ఉత్పత్తి పెంపు, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ -- ఆయిల్ పామ్ ) పథకం కింద విస్తృతంగా ప్రోత్సహిస్తోంది. ప్రతి సంవత్సరం భారతదేశం తినే నూనెల దిగుమతుల కోసం రూ.70,000 కోట్లకు పైగా వ్యయం చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో దేశీయ క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తి గరిష్టీకరణ జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశమని ఆమె పేర్కొన్నారు.ఆయిల్ ఎక్స్ట్రాక్షన్ రేషియో రైతుల ఆదాయాన్ని నేరుగా ప్రభావితం చేస్తుందని, కేవలం 1 శాతం ఓ ఇ ఆర్ తగ్గుదల వల్ల ప్రతి టన్ను తాజా పండ్ల గుత్తులపై సుమారు 10 కిలోల నూనె నష్టం సంభవిస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఆర్థిక సహాయం అందించినప్పటికీ, అనేక సహకార ప్రభుత్వ ఆధ్వర్యంలోని పామ్ ఆయిల్ మిల్లులు పాతబడిన ప్రాసెసింగ్ యంత్రాలతో కొనసాగుతున్నాయని తెలిపారు. దీని వల్ల అనవసరంగా నూనె దిగుబడి నష్టాలు ఏర్పడుతూ రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుతోందన్నారు.
ఈ నేపథ్యంలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ -- ఆయిల్ పామ్ పథకం కింద లక్ష్యిత ఆర్థిక సాంకేతిక సహాయం అందించి ఆంధ్రప్రదేశ్లోని పాత పామ్ ఆయిల్ మిల్లులను సమగ్రంగా ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.
సాంకేతిక ఆధునికీకరణ చర్యల ద్వారా నూనె ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగడమే కాకుండా రైతుల జీవనోపాధి రక్షితమై, తినే నూనెల లో దేశం స్వావలంబన దిశగా మరింత వేగంగా పురోగమిస్తుందని ఆమె పేర్కొన్నారు.

## క్రీడాకేంద్రంగాజడ్పీహైస్కూల్:ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 24:**జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల మైదానాన్ని అన్ని రకాల క్రీడలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొని వస్తామని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ రకాల క్రీడల శిక్షణ కోసం అవసరమైన సామాగ్రిని ఏర్పాటు చేశామన్నారు. పేద విద్యార్థులకు క్రీడలలో శిక్షణ పొందటానికి అవకాశం ఉంటుందని అన్నారు. క్రీడా కారులుగా రాణిస్తే ఉద్యోగాలలో అవకాశం ఉంటుందన్నారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి, పట్టణంలో, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో, దేశ విదేశాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగారని అన్నారు. వారందరి సహకారంతో ఈ పాఠశాలను రాష్ట్రస్థాయి లో ఒక మోడల్ స్కూల్ గా అభివృద్ధి చేయాలనేది తమ సంకల్పమని అన్నారు. దశాబ్దాల క్రితం తేతలి రాజేశ్వరరావు సహకారంతో పాఠశాలను నిర్మించారని, గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాల క్రీడామైదానం వర్షపు నీటితో మునిగిపోయి, బురద నీటితో దుర్గంధం వెదజల్లుతూ ఉండేదని అన్నారు. ఆ పరిస్థితి నుంచి నేడు సకల సౌకర్యాలతో పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. పాఠశాలలో సీసీ కెమెరాలు, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం రక్షిత మంచి నీటి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్.వి. సత్యనారాయణ మిత్ర బృందం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు,తదితరులు తన వద్ద పాఠశాల అభివృద్ధి గురించి ప్రతిపాదనలు చేశారన్నారు.తాను కూడా ఈ పాఠశాలలోనే చదివానని, పాఠశాల రుణం తీర్చుకోవాలనే లక్ష్యంతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. పోలీసు శిక్షణకు అవసరమయ్యే క్రీడాంశాలను ఇక్కడ ఏర్పాటుచేసి, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పాఠశాలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాఠశాల అభివృద్ధి నివేదికను, పట్టణంలో నిర్మిస్తున్న ఈతకొలను, స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం తదితర అభివృద్ధి పనుల నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకువెళ్లి,మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ పాఠశాల ఆవరణలోనే ఉన్న జూనియర్ కళాశాల కోసం మరోచోట భవనాన్ని నిర్మించి, పేద విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రైవేటు కళాశాలల్లో లక్షల రూపాయల ఫీజు చెల్లించ లేని విద్యార్థులకు కోసం జూనియర్ కళాశాలను నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు.,ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కళాశాల కోసం ప్రయత్నిస్తామని అన్నారు. నిజాయితీగా పనిచేసే వారికి ప్రజల సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ వి సత్యనారాయణ, జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, చాపల రమేష్, అడ్డగర్ల సురేష్, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, జిల్లా పరిషత్ హై స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.




## రబ్బర్, జాఫ్రా పంటల సాగు చేసే గిరిజన రైతులకు ప్రోత్సాహం





**గంగవరం/మారేడుమిల్లి, పెన్ పవర్, మార్చి 24 :**ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రబ్బర్, జాఫ్రా పంటలను ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్ తెలిపారు.మంగళవారం మారేడుమిల్లి మండలం దేవరపల్లి గ్రామంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రబ్బర్ ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ ప్రాంతంలో మరో 3 వేల ఎకరాల్లో రబ్బర్ ప్లాంటేషన్ ఏర్పాటు చేయడానికి రైతుల నుండి దరఖాస్తులు సేకరించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. రబ్బర్ సొసైటీలు, ప్రాసెసింగ్ స్మోకింగ్ రూముల వివరాలు తెలుసుకుని, మరిన్ని ఐదు స్మోకింగ్ రూములు ఏర్పాటు చేయాలని సూచించారు.రబ్బర్ పంటకు ప్రస్తుతం మంచి మార్కెట్ ఉందని, రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతున్నాయని తెలిపారు. గిరిజన రైతులు ఎదుర్కొనే సమస్యలను వెంటనే రబ్బర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.అనంతరం కుట్రవాడ గ్రామంలో వందన్ వికాస కేంద్రాల ద్వారా ఏర్పాటు చేసిన జాఫ్రా ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. జాఫ్రా సాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య, మార్కెట్ ధరలపై వివరాలు సేకరించారు. జాఫ్రా ఉత్పత్తులకు ఆన్లైన్ బుకింగ్ కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని సూచించారు.రైతులు ట్రాక్టర్, ప్రాసెసింగ్ యంత్రం అవసరాన్ని తెలియజేయగా, వాటిని అందించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని, వారి పిల్లలు ఉన్నత విద్య సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దేవదానం, రబ్బర్ డెవలప్మెంట్ అధికారి సుశాంత్ కుమార్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఆర్డీఏ పీడీ దాసరి రత్నాకర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రణభేరి 3.0లో భాగంగా అడ్డతీగలలో యు.టి.ఎఫ్ నిరాహార దీక్ష..







పలు డిమాండ్లపై ఆందోళన...

**అడ్డతీగల, పెన్ పవర్, మార్చ్ 24;** యుటిఎఫ్ రాష్ట్ర మరియు జిల్లా నాయకత్వం పిలుపు మేరకు,అడ్డతీగలలో 'రణభేరి 3.0' కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు నిరాహార దీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ దీక్ష కొనసాగింది.
దీక్షలో గాంధీ, రాంబాబు, శ్రీను, రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి వెంకటరమణ, అమిద్, సత్తిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అడ్డతీగలతో పాటు గంగవరం, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల నుంచి కూడా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పలు కీలక డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. 12వ పీ.ఆర్.సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి, 29 శాతం ఐ.ఆర్ ప్రకటించాలి, డీఏ బకాయిలను విడుదల చేయాలి, పెండింగ్ బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలి, మెమో 57ను అమలు చేయాలి, హెల్త్ స్కీమ్ మరియు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
అనంతరం ఉపాధ్యాయులు ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో కార్యాలయానికి చేరుకుని తమ డిమాండ్లతో కూడిన మెమోరాండంను సమర్పించారు. ఈ నిరాహార దీక్ష ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కోసు. కృష్ణ, జిల్లా ఆడిటర్ మంగరాజు, జిల్లా కోశాధికారి బోజ్జయ్య, జిల్లా కార్యదర్శి రమణ, మండల అధ్యక్షుడు గాంధీ, ప్రధాన కార్యదర్శి కె.వీ రాఘవులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం భారీ ర్యాలీ....





**అడ్డతీగల, పెన్ పవర్ ,మార్చ్ 24:** అడ్డతీగల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం లో మంగళవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం నిర్వహించారు. హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ క్రమంలో డాక్టర్ మహేష్ రెడ్డి మాట్లాడుతు టీ.బీ యొక్క చరిత్ర మార్చి 24, 1882, న ఈ రోజున, జర్మన్ శాస్త్రవేత్త డాక్టర్ రాబర్ట్ కోచ్ బాక్టీరియం (మైకోబాక్టీరియం క్షయవ్యాధి) క్షయవ్యాధికి కారణమవుతుంది గుర్తించిన రోజు మార్చి 24 అని ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చ్ 24 న జరుపుకోవడం జరుగుతుందని అన్నారు.ఈ దినోత్సవం క్షయవ్యాధి పట్ల,ప్రజారోగ్యంపై దాని ప్రభావం గురించి ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచుతుంది అని అన్నారు. దీనికి చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ, క్షయవ్యాధి ప్రపంచంలోని అత్యంత ప్రాణాంతక అంటు వ్యాధులలో ఒకటిగా ఉంది అని తెలిపారు.అనేక దేశాలలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది దీని బారిన పడుతున్నారు అన్నారు.
ఈ దినోత్సవం టి.బికి ముందస్తు రోగ నిర్ధారణ మరియు సకాలంలో చికిత్స యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుంది అని డాక్టర్ మహేష్ రెడ్డి అన్నారు.ప్రపంచవ్యాప్తంగా క్షయవ్యాధిని నిర్మూలించడానికి బలమైన ప్రయత్నాలను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది అని డాక్టర్ రేష్మ ఆయుర్వేద వైద్యులు అన్నారు. ఆరోగ్య సంస్థలు ప్రపంచ టి.బి దినోత్సవాన్ని టి.బిలక్షణాలు, నివారణ గురించి సమాజాలకు అవగాహన కల్పించాలని ,హాస్పిటల్ కౌన్సిలర్ నారే. వాసు అన్నారు. ప్రజాలకు అవగాహన కల్పిస్తూ హాస్పిటల్ ప్రాంగణం నుంచి ప్లకార్డులు ప్రదర్శించారు.టీబీ గురించి అడ్డతీగల మండలం లో ఉన్న హాస్పిటల్ సిబ్బంది అలాగే ఎస్. టి బాయ్స్ హాస్టల్ విద్యార్థులు తో కలసి విధులలో ప్రచారాలు నిర్వహించి, ర్యాలీ మరియు మానవహారం నిర్వహించారు. అలాగే ఆర్. టి. సి. బస్ స్టాండ్ దగ్గర వేచి ఉన్న ప్రయాణికులుకు టీబీ గురించి అవగాహనా కల్పించారు. మంగళవారం వారపు సంత కావడంతో అడ్డతీగల పూరవిధులలో భారీ ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో టీబీ గురించి అవగాహనా కల్పించారు. తద్వారా ఎవరికైనా ఈ లక్షణాలు ఉన్నయెడల,ఎవరైనా పరీక్షలు అవసరం అయితే,చికిత్స పూర్తి ఉచితం గా గవర్నమెంట్ వీరికి అందుబాటులో ఉంటుందని, మందులు వాడే సమయంలో న్యూట్రిషన్ ఫుడ్ క్రింద డబ్బులు వారి ఖాతాలో నేరుగా నెల నెల జమ అవుతుంది అని హాస్పిటల్ కౌన్సిలర్ వాసు అన్నారు. ప్రభుత్వాలు మరియు ఆరోగ్య సంరక్షణ నిపుణులు కలిసి టి.బి నియంత్రణ కార్యక్రమాలను బలోపేతం చేయడానికి, గవర్నమెంట్ హాస్పిటల్ లో ప్రత్యేకంగా టీ.బీ యూనిట్ ని ఏర్పాటు చేసారు అని హాస్పిటల్ టీ.బీ యూనిట్ సిబ్బంది అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం థీమ్
ప్రభుత్వాలు, ఆరోగ్య సంరక్షణ కార్మికులు మరియు సమాజాలు ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి కలిసి పనిచేయాలి అని, ఈ ప్రచారం ముందస్తు రోగ నిర్ధారణ, సకాలంలో చికిత్స, మరియు మెరుగైన ఆరోగ్య సంరక్షణ ప్రాప్యతను ప్రోత్సహిస్తుంది అని, ఇది క్షయవ్యాధి చుట్టూ ఉన్న కళంకాన్ని తగ్గించడానికి అవగాహన అవసరం ఎంతైనా ఉంది అని ,డాక్టర్ మహేష్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమం లో టీ.బీ సూపర్వైజెర్స్, శాంతి, లక్ష్మి,హాస్పిటల్ స్టాఫ్ దేవుడు, వెంకటలక్ష్మి, అమ్మాజీ,సునీత,సీత,ఊహ, బాపనమ్మ,పి. హెచ్. సి స్టాఫ్ తులసి, సత్యవతి, దేవుడమ్మా, వసంత,వెంకట్, విజయ ,రమణారెడ్డి పాల్గొన్నారు.

## గోకవరం ఆరోగ్యశాఖ సిబ్బంది గండ్రెడ్డి వీర వెంకట రమణ,, దేవి లకు అభినందనలు వెల్లువ





**గోకవరం పెన్ పవర్ మార్చి 24 :**-ప్రపంచ టి.బి దినోత్సవ సందర్భంగా గోకవరం వైద్య ఆరోగ్యశాఖ లో పని చేస్తున్న గండ్రేడ్డి వీర వెంకటరమణ,గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రం లో టి .బి సెక్షన్లో ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేయుచున్న దేవి ల సేవలను గుర్తించి జిల్లాఅధికారులు ప్రశంసాపత్రంతో సన్మానించారు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం వైద్య ఆరోగ్యశాఖాధికారి మరియు తూర్పుగోదావరిజిల్లా క్షయ నియంత్రణాధికారుల చేతులమీదుగా ఉత్తమ సేవలకు గాను జి.కొత్తపల్లి పి. హెచ్. సి హెల్త్ అసిస్టెంట్ గండ్రేడ్డి వీర వెంకట రమణ కు మరియు గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రం లో టి .బి సెక్షన్లో ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేయుచున్న దేవికి ప్రసంశా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సి.హెచ్.సి సూపరిండెంట్ డా. ఎల్ రామలక్ష్మి జి.కొత్తపల్లి పి.హెచ్.సి వైద్యులు డా. తిరన్, డా.నిఖిత వైద్యసిబ్బంది అభినందించారు. ఉత్తమ సేవలందించిన గండ్రేడ్డి రమణ,, దేవి లను పలువురు ప్రతినిధులు అభిమానులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## జి జి హెచ్ - వైద్య కళాశాలల ఆధ్వర్యం లో ర్యాలీ, మానవ హారం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 24:**ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ప్రజల్లో క్షయవ్యాధి పట్ల సమగ్ర అవగాహన పెంపొందించడం అవసరమని, క్షయవ్యాధి నిర్మూలనకు వైద్య విద్యార్థులు ప్రజల భాగస్వామ్యం కీలకమని డా. కె.వి. శివ ప్రసాద్ అన్నారు. సమాజంలో క్షయవ్యాధిపై అపోహలను తొలగించి, ముందస్తు జాగ్రత్తలు, సమయానుకూల చికిత్స ద్వారా టిబిని పూర్తిగా నివారించవచ్చునన్నారు.మంగళవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ధవళేశ్వరం లోని రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వద్ద అవగాహన ర్యాలీ మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. వి.వి. దుర్గా ప్రసాద్ , ఎంబీబీఎస్ విద్యార్థులు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.క్షయవ్యాధి వ్యాప్తి కారణాలు, నివారణ చర్యలు, ఉచిత వైద్య సేవలు, పూర్తి స్థాయి చికిత్స అవసరం, రోగుల పట్ల సమాజ ధృక్పథం, క్షయవ్యాధి నిర్మూలనలో వైద్య విద్యార్థులు, అంశాలపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగ బోధనా సిబ్బంది ప్రొఫెసర్ డా. బి. శ్రీనివాస్ నాయక్, టిబి ముక్త భారత్ నోడల్ అధికారి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఆర్. సురేంద్ర బాబు డా. ఆర్.వి.వి. సత్యనారాయణ (వైద్యాధికారి, పిహెచ్‌సి ధవళేశ్వరం), శ్రీమతి రమాదేవి (పిహెచ్ఎన్), డా. భరత్ ఎస్.ఆర్., కళాశాల సిబ్బంది పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి..

మండల తాసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు



**సీతానగరం, పెన్ పవర్, మార్చి24:**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని చిన కొండెపూడి సొసైటీ చైర్మన్ కాండ్రు శేఖర్ గ్రామం లో ఉన్న రైతులు కలిసి మండల తాసిల్దార్ కు మంగళవారంనాడు తాసిల్దార్ కార్యాలయంలో చినకోండేపూడి రైతులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ శేఖర్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల ధాన్యాన్ని ఆఫ్లైన్లో ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు త్వరిగతిన ప్రారంభించాలని అన్నారు. వాతావరణం పరిస్థితులు అనుకూలంగా లేనందున రైతులు పండించిన ధాన్యం వృధా అవ్వకుండా ఉన్నతాధికారులకు సంప్రదించి రైతులను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి రైతులను కాపాడాలని తెలిపారు.

# అవగాహనతోనే క్షయ దూరం




**సీతానగరం, పెన్ పవర్, మార్చి24:**సీతానగరం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ ఎమ్ . శైలజ రాణి ఆధ్వర్యంలో క్షయవ్యాధి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు .ఈ సందర్భంగా డాక్టర్ శైలజ రాణి మాట్లాడుతూ క్షయ వ్యాధిని ముందుగా గుర్తించి సకాలం లో మందులు వాడాలని లేకపోతే ప్రాణాంతకం అవుతుందని అన్నారు.క్షయవ్యాధి నిర్మూలన కోసం సమాజంలో అందరూ ఈ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండి ఈ వ్యాధిని తరిమికొట్టడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రెండు వారాలు మించి దగ్గు ,ఆకలి లేకపోవడం,శరీర బరువు తగ్గడం,తరచూ జ్వరంరావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు వచ్చిఉచితంగా కళ్లి పరీక్ష చేయించు కోవాలని చెప్పారు.తదనంతరం వైద్యారోగ్య సిబ్బంది "క్షయవ్యాధిని తరిమి కోడదాం"అనే ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ వై.యస్.రాయుడు పి హెచ్ ఎన్ డి .దైవకృప,సూపర్వైజర్ కె. సుధాకర్, ఎమ్ ఎల్ హెచ్ పి. అరుణ, హెల్త్ అసిస్టెంట్ పి. నందీష్ ఏఎన్ఎం లు ఎస్.కె షలిమా,కె.శారద,తులసి,రోజా,అమృత,రాజేశ్వరి, ఓపి. సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు ఎం. కుమారి, జ్యోతి,నాగమణి మరియు ప్రజలు పాల్గొన్నారు.

## డి.రామవరం--దుశ్శర్తి రహదారి 8 కిలోమీటర్ల పనులు వెంటనే పూర్తి చేయాలి: లోత .రామారావు.






**అడ్డతీగల ,పెన్ పవర్,మార్చ్ 24:**అడ్డతీగల మండలంలో డి.రామవరం సెంటర్ నుంచి దుశ్శర్తి వరకు నిర్మాణంలో ఉన్న రహదారి మూడు సంవత్సరాలుగా నిలిచిపోవడంతో, మూడు పంచాయతీలకు చెందిన 23 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని లోత .రామారావు అన్నారు. రహదారిపై వెటమిక్స్ వేసి వదిలేయడంతో మెటల్ లేచిపోవడం, దుమ్ము ,దూళి విపరీతముగా గాలిలో కలవడంతో వాహనదారులకు అయోమయ పరిస్థితి ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.ఈ సమస్యపై స్పందించిన గిరిజన నాయకుడు లోతా. రామారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డతీగల గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి అడ్డతీగల ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకుని వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో కోన.గణేష్, పల్లాల .నాగారత్నం, చెక్కా. అచ్చి అమ్మ, దేవుడమ్మ, ముర్ల. సత్యనారాయణరెడ్డి, పోతురు. శ్రీనుబాబు, పొడుగు. నారాయణ, రెడ్డిప్రోలు. విశ్వనాధమ్మ, సావిత్రి, రమాదేవి, పల్లాల. పండురెడ్డి, సత్తిబాబు, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.
ఈ విషయముపై ఎంపీడీవో కుమార్ వివరణ ఇస్తూ, వారం రోజుల్లో పనులు పునఃప్రారంభిస్తామని హామీ ఇవ్వగా, హామీ నెరవేర్చకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

# ఎమ్మెల్యే బత్తులను విమర్శించే నైతిక హక్కు జక్కంపూడి కుటుంబానికి లేదు

- గత ప్రభుత్వంలో జక్కంపూడి దోపిడి, దందాలు ప్రజలకు తెలిసిందే
- మీడియా సమావేశంలో జక్కంపూడి కుటుంబంపై జనసైనికులు ధ్వజం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 24:** రాజానగరం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ , ఆయన సతీమణి వెంకటలక్ష్మి లను విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబానికి లేదని నియోజవర్గ జనసేన నాయకులు బత్తుల అనుచరులు ద్వజమెత్తారు. మంగళవారం బత్తుల స్వగృహంలో జరిగిన మీడియా సమావేశంలో జనసేన సీనియర్ నాయకులు అడపా శ్రీను మాట్లాడుతూ, గత వైసిపి హయాంలో ఐదు ఏళ్ళు కొండలు, గుట్టలు, మెట్టలు , చెరువులు ఇసుక, సహజ వనరులను దోచుకున్నారని, భూకబ్జాలతో మాఫియా రాజ్యం నడిపారని, వందల కోట్లు దండుకున్న ఘనత మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబానికే దక్కుతుందని విమర్శించారు. గత ఐదు సంవత్సరాలుగా జరగని అభివృద్ధి 20 నెలల్లో నియోజకవర్గం అభివృద్ధి పదంలో దూసుకు పోతుందన్నారు, నియోజకవర్గంలో బత్తుల కుటుంబానికి పెరుగుతున్న ప్రజాధారణ ను చూసి ఓర్వ లేక చేస్తున్న నిరాధార ఆరోపణలను ఆయన ఖండించారు. స్థానికేతరుడుగా 2019లో ఎమ్మెల్యేగా గెలిచి దళితున్ని శిరో ముండనం చేసినది మొదలు ఐదేళ్లు నియోజక వర్గాన్ని నేరాల్లో నెంబర్ వన్ గా చేశారని విమర్శించారు. తమరి కుటుంబంలో మహిళలు ఉన్నారని, ఎదుటివారి కుటుంబాల్లోని మహిళలపై అసత్య ఆరోపణలు చేస్తూ వ్యక్తిత్వాన్ని హననానికి పాల్పడం నీచ సంస్కృతి అని విమర్శించారు. మహిళలనే కనీస గౌరవం లేకుండా ఎమ్మెల్యే భార్యను తిడితే ఎవరు సహిస్తారని, ఆ కుటుంబం లోనే మరొక వ్యక్తి అబ్బా ,అమ్మ అంటే ఇంటికి వచ్చి కొడతానని బెదిరిస్తే, బెదిరేది లేదని జనసైనికులు తాట తీస్తారని హెచ్చరించారు. వెంకటలక్ష్మి పై చేసిన ఆరోపణలు ధైర్యం ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. ఎన్నికల ముందు బత్తుల ను దొంగ, దొంగని నియోజవర్గంలో తప్పుడు ప్రచారం చేసిన జక్కంపూడి ని 35 వేల మెజారిటీతో ప్రజలు ఓడించి ఇంటికి పంపించిన గుణపాఠం రాలేదని విమర్శించారు. గత ఐదేళ్లు సంపాదించిన వందల కోట్ల ఆస్తులతో బెంగళూరు, హైదరాబాదు, ద్రాక్షారామం పలు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాల అవినీతి చిట్టా ను ప్రజల ముందు విప్పుతామని హెచ్చరించారు. దాడులకు ప్రతి దాడులు ఉంటాయని, జన సైనికులు యుద్ధానికి సిద్ధంగా ఉన్నారని, తాటాకు బెదిరింపులకు బెదిరేది లేదన్నారు. ఎన్నికల్లో బత్తుల ఒక ఓటుతో గెలిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని చేసిన శపదాన్ని ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ప్రజల పక్కన ప్రతిపక్ష పాత్ర పోషించాలని, భాష మార్చుకుంటే మంచిదని, రాజకీయ విమర్శలు సహజమని, వ్యక్తిగత విమర్శలకు చేస్తే సహించేది లేదన్నారు. 20 నెలల బత్తుల అవినీతిపై లక్ష పుస్తకాలు ముద్రిస్తే, జక్కంపూడి 5 సంవత్సరాల అవినీతిపై ఎన్ని లక్షల పుస్తకాలు ముద్రించాలో చెప్పాలన్నారు. నియోజవర్గాన్ని అభివృద్ధి చేయడంలో నిజంగానే బత్తుల కు కంటిమీద కునుకు లేదన్నారు. రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ మద్దాల యేసు రత్నం మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో వైసిపి వారే చెరువులు చెరపట్టారని, అందుకు రాజానగరం చెరువు ఉదాహరణ అని, కూటమీ ప్రభుత్వం లో కూటమి పార్టీలు చెరువులను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పాత్ర పోషించి ప్రజల మేలు కోసం పనిచేయాలని హితవు పలికారు. రాజానగరం జనసేన నాయకులు తోట రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పథకాలను రాజకీయాలకతీతం గా బత్తుల అందజేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వెంకటలక్ష్మి మీద చేసిన ఆరోపణల తో రాజకీయాల్లో మరింత దిగజారిపోయారని, ఇదే ధోరణి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో తమ కు 60 వేల మెజారిటీ ఖాయమని, జక్కంపూడి కి భవిష్యత్తు శూన్యమని అన్నారు. జనసేన నాయకులు వేగిశెట్టి రాజు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో బత్తులను ఓడించడానికి ఐదు డమ్మీ పేర్లతో కుట్రలు చేసిన 6000 మెజారిటీ వచ్చిందన్నారు ఇకనైనా క్రిమినల్ చర్యలను మానుకోవాలన్నారు. ఐదు సంవత్సరాలుగా లేని సంక్షేమం సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు, మంచినీటి, రోడ్లు వంటివి ఎన్నో అభివృద్ధి పనులు నియోజకవర్గంలో జరుగుతున్నాయని వాటిని బట్టే ఎమ్మెల్యే బత్తుల పనితనం ప్రజలకు అర్థమవుతుందని జక్కంపూడి కుటుంబం ఓర్వలేక అవాకులు, చవాకులు ఉన్నారని మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇకనైనా రాజకీయాలు హుందా తనంగా చేయాలని, ప్రజా సమస్యలపై పోరాడాలని, ప్రజల విశ్వాసం పొందాలని హితవు పలికారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు కిమిడి శ్రీరామ్ చల్లారావు ,వేగిశెట్టి రాజు, గెద్దాడ త్రిమూర్తులు, డాక్టర్ విజయకుమార్ ,సూర్యవతి, కాంద్రేగుల పోసి రత్న పోసి రత్నాజీ రావు, మట్ట వెంకన్న, లక్ష్మి జయసుధ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ నిర్మూలన అందరి బాధ్యత

- జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,మార్చి 24** : పోలవరం జిల్లాలో టీబీ (క్షయవ్యాధి) నిర్మూలన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రంపచోడవరం ప్రాజెక్టు అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు.మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణం నుంచి నిర్వహించిన టీబీ అవగాహనా ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీబీ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రతి గ్రామంలో టీబీపై అవగాహన పెంచడం అత్యంత అవసరమని తెలిపారు. “మనందరి పంతం -- టీబీ అంతం”, “టీబీ దగ్గు డాట్‌తో తగ్గు”, “ఉచిత మందులే ముద్దు” వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. రెండు వారాలకుపైగా దగ్గు కొనసాగితే తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని, టీబీ బాధితులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత మందులు తీసుకుని పూర్తిగా నయం కావచ్చని వివరించారు.ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో “టిబి ముక్త్ భారత్ అభియాన్”కు మద్దతుగా విద్యార్థులు నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పి. సరిత, వైద్యాధికారులు సుజిత, వినోద్, ఈక్షిత్, సీహెచ్‌ఓ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనపై ప్రత్యేక దృష్టి

**రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం ఎం నాయక్**





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 24** : పోలవరం జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన జరగాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్ ఉపాధ్యాయులకు ఆదేశించారు.మంగళవారం రంపచోడవరం మండలం పెద్దగెదాడ గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్‌తో కలిసి పాఠశాల పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎం.ఎం. నాయక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి విద్యార్థికి పాఠాలు పూర్తిగా అర్థమయ్యేలా ఒకటికి రెండుసార్లు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.చదువులో వెనుకబడిన విద్యార్థులను ఎఫ్ఎల్ఎన్, తరల్ కార్యక్రమాల ద్వారా ఏ, బి, సి, డి గ్రేడులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకురావాలని తెలిపారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా, శారీరక శిక్షలు లేకుండా బోధన కొనసాగించాలని స్పష్టం చేశారు. చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక నైపుణ్యాలను విద్యార్థులకు స్పష్టంగా బోధించాలని సూచించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం లెసన్ ప్లాన్‌లను అనుసరించి సిలబస్‌ను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విద్యార్థులకు అర్థమవుతున్నాయా లేదా అన్న విషయాన్ని స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ముస్తాబు కార్యక్రమం అమలుపై కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు ప్రతిరోజూ పరిశుభ్రంగా సిద్ధమై తరగతులకు హాజరుకావాలని సూచించారు. పాఠశాలలో ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని తెలిపారు.అదేవిధంగా పీఎం జన్మన్ పథకం కింద రూ.2.75 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న డైనింగ్ హాల్, హాస్టల్ భవన పనులను పరిశీలించి, నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డీఈ చైతన్య, ఏఈ సత్యనారాయణ, సహాయక గిరిజన సంక్షేమ అధికారి జె. శంభుడు, ప్రధానోపాధ్యాయులు డి. నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.




# ఈనెల 31 నాటికి 100 శాతం పన్నుల వసూలు లక్ష్యం సాధించాలి

**కమిషనర్ వి.ఆర్. కృష్ణతేజ మైలవరపు**






**రాజమహేంద్రవరం, పెన్ పవర్,మార్చి 24**
గ్రామ పంచాయతీల ఆర్థిక పరిపుష్టి, గ్రామీణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు పన్ను వసూళ్లే ప్రధాన ఆధారమని, మార్చి 31 నాటికి నూరు శాతం పన్నులు వసూలు అయ్యేలా అధికారులు పనిచేయాలని వి.ఆర్. కృష్ణతేజ మైలవరపు స్పష్టం చేశారు.
విధుల్లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్న అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పనితీరు మెరుగుపడని క్షేత్రస్థాయి పంచాయతీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మంగళవారం ఆనం కళా కేంద్రం లో గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై పంచాయతీ సెక్రటరీలు, గ్రామ అభివృద్ధి అధికారులు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో కమిషనర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్ల లక్ష్య సాధనలో అలసత్వం సహించబోమని హెచ్చరించారు. తూర్పు గోదావరి జిల్లాలో కొన్ని గ్రామ పంచాయతీలలో భారీ మొత్తంలో పన్నులు పెండింగ్‌లో ఉన్నాయని, ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి సారించి వసూళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. పన్నులు చెల్లించని వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించే విధానాన్ని అమలు చేయడం వల్ల పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కలిగిందని కృష్ణ తేజ తెలిపారు. పట్టణ ప్రాంతాల మాదిరిగానే గ్రామీణ ప్రాంతాల్లో కూడా ముందస్తు పన్ను చెల్లింపుదారులకు ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. పంచాయతీ సెక్రటరీలకు పదోన్నతుల కోసం ప్రత్యేక ఛానల్ ఏర్పాటు చేసినట్లు, పెండింగ్ పదోన్నతులను కూడా మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.జిల్లా పంచాయతీ అధికారి వి .శాంతకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే రూ. 82 కోట్ల పన్ను వసూళ్లు జరిగినట్లు తెలిపారు.ఈ సమీక్షా లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెడ్పీ సి ఈ వో వి వి లక్ష్మణ్, డిఎల్‌పిఓ ఏం.నాగలత, డి ఎల్ డి వో లు పి. వీణా దేవి, ఏస్లివా రెడ్డి, జిల్లాలోని ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, గ్రామ అభివృద్ధి అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పంచాయితీ, బ్లాక్ పంచాయతీ,మండల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



**వై రామవరం, పెన్ పవర్, మార్చ్ 24 :** పంచాయితీ అభివృద్ధి, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి, మండల అభివృద్ధి ప్రణాళిక పై ఒక రోజు శిక్షణా కార్యక్రమం సభ్యులకు ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు.
మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల అభివృద్ధి ప్రణాళిక పై ప్రజాప్రతినిధులకు, పంచాయతీ అభివృద్ధి అధికారులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లకు, వెలుగు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కే ఆనందరావు, వైస్ ఎంపీపీ లు జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, డిప్యూటీ ఎంపీడీవో రాజు, ఏపీవోలు స్వామి సాయిబాబా ఇతర సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

# టీబీ నిర్మూలన అందరి బాధ్యత




జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,మార్చి 24** : పోలవరం జిల్లాలో టీబీ (క్షయవ్యాధి) నిర్మూలన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రంపచోడవరం ప్రాజెక్టు అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు.మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణం నుంచి నిర్వహించిన టీబీ అవగాహనా ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీబీ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ప్రతి గ్రామంలో టీబీపై అవగాహన పెంచడం అత్యంత అవసరమని తెలిపారు. “మనందరి పంతం -- టీబీ అంతం”, “టీబీ దగ్గు డాట్‌తో తగ్గు”, “ఉచిత మందులే ముద్దు” వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. రెండు వారాలకుపైగా దగ్గు కొనసాగితే తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని, టీబీ బాధితులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత మందులు తీసుకుని పూర్తిగా నయం కావచ్చని వివరించారు.ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో “టిబి ముక్త్ భారత్ అభియాన్”కు మద్దతుగా విద్యార్థులు నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పి. సరిత, వైద్యాధికారులు సుజిత, వినోద్, ఈక్షిత్, సీహెచ్‌ఓ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



- గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 24** :పోలవరం జిల్లాలో వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం సాయంకాలం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ కూడా హాజరయ్యారు.గిరిజనులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే పనులను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ నీటిపారుదల, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా ఆశ్రమ పాఠశాలల్లో మంజూరైన మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్ల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఇంకా పూర్తి చేయాల్సిన పనులపై వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల అవసరాలపై సమగ్ర నివేదికలు తయారు చేసి అందించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య, పాఠశాలల పరిస్థితులు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు వంటి అంశాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు.జల జీవన్ మిషన్, గృహ నిర్మాణ పథకాలు, పీఎం జన్మన్ పథకం కింద అంగన్వాడీ భవనాల నిర్మాణంపై కూడా ఆయన ఆరా తీశారు. మంజూరైన గృహాలను మూడు నెలల్లో పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు.అంగన్వాడీ కేంద్రాలు, ఐసీడీఎస్ ప్రాజెక్టులు, లబ్ధిదారుల వివరాలు, గర్భిణీ స్త్రీలకు అందుతున్న పౌష్టికాహారం వంటి అంశాలపై సమగ్ర సమాచారం సమర్పించాలని సూచించారు. వందన్ వికాస్ కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.పశుసంవర్ధక శాఖ ద్వారా గిరిజనులకు సబ్సిడీపై పశువులు, కోళ్లు అందజేయడం, ఆరోగ్య శాఖ పనితీరు, రక్తహీనత నివారణ చర్యలు, వైద్య సిబ్బంది ఖాళీలపై కూడా సమీక్షించారు. సరిగా పనిచేయని ఆశా వర్కర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని, డిప్యూటీ డైరెక్టర్ పర్యవేక్షణ పెంచాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని ప్రధానోపాధ్యాయులు క్రమం తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సరిత, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 24 :** ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా వై జంక్షన్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో తొలుత రాబర్ట్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పోటీలలో విజేతలకు సర్టిఫికెట్లు అందజేసి, ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.

ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగాముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ , ప్రజల భాగస్వామ్యంతో క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చు. క్షయవ్యాధి పూర్తిగా నయం అవుతుందని, ముందస్తు గుర్తింపు అత్యంత ముఖ్యం. రెండు వారాలకుపైగా కొనసాగే దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రివేళల్లో అధిక చెమటలు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించు కోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు, చికిత్స అందుబాటులో ఉన్నాయన్నారు . భారత ప్రభుత్వం టి బి బాధితులకు పోషకాహార మద్దతు అందిస్తోందన్నారు. యువత, విద్యార్థులు సమాజానికి ఆరోగ్య దూతలగా పరిసర ప్రాంత ప్రజలకు టిబి పై అవగాహన కల్పించడం, బాధితులను వివక్ష లేకుండా ఆదరించాలన్నారు ప్రజలు కలిసి పనిచేస్తే క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మించగలమన్నారు. తూర్పు గోదావరి జిల్లాను టిబి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు మనందరం కలిసికట్టుగా ముందుకు సాగుదామని పిలుపు ఇచ్చారు.

జిల్లా కుష్టు నివారణ అధికారి డా. ఎన్. వసుంధర మాట్లాడుతూ, "కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం -- ప్రజల భాగస్వామ్యం కీలకం" అనే నినాదంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు, వివిధ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టిబి ను ముందస్తుగా గుర్తించేందుకు ఏ ఐ సాంకేతికత ఆధారిత నూతన పరికరాలను సబ్ సెంటర్లలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆర్.కె. మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగంతో కలిసి ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు రంగోలి, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు గత వారం రోజులుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారోత్సవాల్లో భాగంగా

నిర్వహించిన రంగోలి, వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథులు సర్టిఫికెట్లు అందజేసి అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు, వివిధ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రెడ్ క్రాస్ సభ్యులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# టి బి వ్యాధి నియంత్రణలో ప్రతిఒక్కరు తమవంతు భాగస్వామ్యం అవసరం.

- ప్రపంచ టీ బి డే లో డాక్టర్ ఎల్ రామలక్ష్మి పిలుపు



**గోకవరం పెన్ పవర్ మార్చి 24 :**–టి బి వ్యాధి నియంత్రణలో ప్రతిఒక్కరు భాగస్వామ్యం అవసర మని గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రామలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ టీ బి డే లో భాగంగా గోకవరం మండలం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి (సి. హెచ్. సి )నందు సూపరిండెంట్ డా. రామలక్ష్మి అధ్యక్షతన ఆసుపత్రి వైద్యులు డా. పవన్ దత్త, డా. అభినవ్, డా. మౌనిక, డా. వైశాలి సమక్షంలో "ప్రపంచ టి . బి.డే "సందర్భంగా స్థానిక రాజా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, మరియు జి. కొత్తపల్లి పి హెచ్. సి వైద్య సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని డా. పవన్ దత్త (పల్ మనాలజిస్ట్ )ప్రారంభించి విద్యార్థులకు అవగాహన కల్పించి "అవును మనం టి. బి ని ముగించగలం" అనే ఈ ఏడాది నినాదంతో ముందుకు వెళ్లాలని టి. బి. ని నియంత్రిశీచడంలో ప్రతీ ఒకరి భాగస్వామ్యం కావాలని టి.బి అనుమానిత లక్షణాలు కనబడగానే దగ్గరలోనున్న ప్రభుత్వ ఆసుపత్రిలో కళ్లె పరీక్ష చేయంచు కోవాలన్నారు. ఈ ర్యాలీ గోకవరం పి. హెచ్.సి. నుండి దేవిచౌక్ సెంటర్ వరకు ర్యాలీ ని నడిపించి మానవహారం నిర్వహించారు. మరియు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆర్. శ్రీనివాస్, ఏ. అరుణ, పిట్టా అరుణ్, హెడ్ నర్స్ విమల, ఎన్. సి. డి, సి. డి స్టాఫ్ నర్స్ లు, హెచ్. వి. రాజేశ్వరి టి. బి యూనిట్ ఎల్. టి. దేవి, ఏమ్. ఎల్. హెచ్పిలు అరుణ, అనూష, ఏ. ఎన్. ఎమ్ లు అమ్మాయి, నాగరత్నం, బాపనమ్మ, విశ్వనాథం, ఆశాలు, రాజా స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

# వేటమామిడి జంక్షన్లో 2 కేజీల గంజాయి తో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు...



**అడ్డతీగల, పెన్ పవర్, మార్చ్ 24:** మంగళవారం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ,ముందస్తు సమాచారం మేరకు అడ్డతీగల మండలం వేటమామిడి జంక్షన్లో, అడ్డతీగల సీఐ బి. నరసింహమూర్తి ,ఎస్సై బి. వినోద్ మరియు పోలీసు సిబ్బంది, వాహనాలు తనిఖీ చేస్తుండగా వై .రామవరం నుండి వేటమామిడి వైపు వస్తున్న, సుజుకి యాక్సెస్ 125. ఏ.పీ బిఎస్. డబ్ల్యు 9304 నెంబర్ గల వాహనం పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను అనుమానంతో వారిని ఆపి తనిఖీ చేయగా, ఆ వాహనం డిక్కీలో రెండు కేజీల గంజాయిని గుర్తించి, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని ముంగర .శాంతిరాజు, గోపాల. కాలేబు గా గుర్తించరూ, పట్టుబడిన గంజాయి విలువ సుమారు'లక్ష'రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులను మధ్యవర్తుల సమక్షంలో అరెస్టు చేసినట్లు అడ్డతీగల ఎస్సై బి .వినోద్ తెలిపారు. అనంతరం వీరిని అడ్డతీగల జే ఎఫ్ సి ఎం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. కేసును అడ్డతీగల సీఐ బి. నరసింహమూర్తి దర్యాప్తు చేస్తున్నారు అని తెలిపారు.

# తూర్పులో పైప్ గ్యాస్ కనెక్షన్ల విస్తరణను వేగవంతం చేయాలి




జేసి వై మేఘా స్వరూప్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ మార్చి, 24 :** తూర్పు గోదావరి జిల్లాలో గృహాలు, వాణిజ్య సంస్థలు పారిశ్రామిక అవసరాలకు పైపుల ద్వారా సహజ వాయువు సరఫరాను విస్తరించేందుకు చర్యలు వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ స్పష్టం చేశారు.

మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గోదావరి గ్యాస్ ప్రతినిధులు, హోటల్, రెస్టారెంట్స్ అసోసియేషన్ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పైప్‌లైన్ నెట్‌వర్క్ విస్తరణ పనులు వేగంగా పూర్తి చేసి గృహ వినియోగదారులకు అంతరాయం లేకుండా గ్యాస్ సరఫరా అందించాలని, ఏజెన్సీస్ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. గృహ సముదాయాల వద్ద పైపు లైన్ల గృహాల వారు ఇన్స్టలేషన్ చార్జీలు చెల్లించవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. హోటళ్లు, పరిశ్రమలు తప్పనిసరిగా పైప్ గ్యాస్ వినియోగానికి మారాలని కోరారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 1,15,000 గృహ కనెక్షన్ల లక్ష్యంతో పనులు కొనసాగుతు న్నాయని ఏజెన్సీస్ ప్రతినిధులు వివరించారు. తూర్పు గోదావరి జిల్లాలో 19 వేల ఇళ్లకు కనెక్షన్లు అందించామని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి వి. పార్వతి మాట్లాడుతూ, ప్రజలను పైప్ గ్యాస్ వినియోగా నికిప్రోత్సహిం చాలని సూచించారు. గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి శ్రీకాంత్ మాట్లాడుతూ గృహ వినియో గదారులకు సురక్షితమైన, నిరంతరాయ గ్యాస్ సరఫరా అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గృహ కనెక్షన్ పొందడానికి రూ. 6,500 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, అందులో రూ. 5,000 వాపసు చేయబడుతుందని చెప్పారు. గృహ వినియోగ గ్యాస్ ధర క్యూబిక్ మీటర్‌కు రూ. 55గా ఉండి, ద్వైమాసిక బిల్లింగ్ విధానం అమల్లో ఉందన్నారు. వాణిజ్య వినియోగదారులకు క్యూబిక్ మీటర్ గ్యాస్ ధర రూ. 75గా నిర్ణయించమని, ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లింగ్ జరుగుతుందని తెలిపారు. వాణిజ్య కనెక్షన్లకు రూ. 25 వేల నుండి రూ. 1 లక్ష వరకు డిపాజిట్ వివరించారు. కొవ్వూరు పట్టణంలో 700 గృహాలకు పైప్ గ్యాస్ కనెక్షన్లు అందించామని తెలిపారు. ఈ సమావేశంలో గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, హోటల్ మరియు రెస్టారెంట్స్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు మరియు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డంపర్ బిన్లు ఉండి ఏం ప్రయోజనం ?



**ఏలూరు మార్చి 24 పెన్ పవర్ :** ఏలూరు నగరం 18వ డివిజన్‌లో డింపర్ బిన్‌ను చెత్తలో పడేశారు. గృహాల నుండి సేకరించిన చెద్దను కార్మికులు రోడ్ పైన పడేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా గొల్లాయి గూడెం రాజీవ్ గృహకల్ప కాలనీలో పారిశుధ్యనిర్వహణ మెరుగుపడడం లేదు. దీంతో వ్యర్థాలు రోజుల తరబడి అక్కడే ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అధిరానేల పర్యవేక్షణ లేక పోవడంతో ఈ పరిస్దితి ఏర్పడిందని ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు

# ఉపాధి హామి పనులలో దుర్వినియోగమైన రూ.1,03,507/-రికవరికి ఆదేశం.



**గోకవరం పెన్ పవర్ మార్చి 24:--** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024 -2025 ఆర్థిక సంవత్సరమునకు వివిధ రకాలకు సంబంధించి 894 పనులకు గాను సుమారు 15.77 కోట్ల రూపాయలు పనులు చేపట్టడం జరిగిందని వాటిని ఏ స్థాయిలో వినియోగించారు అనే దానిపై గత నెల రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో గోవిందు తెలిపారు. ఈ తనిఖీకు సంబందించి రూ. 1,03,507/- (ఒక లక్ష మూడు వేల ఐదు వందల ఏడు రూపాయలు) రికవరికి ఆదేశించినట్లు తెలిపారు. గోకవరం మండలంలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబందించి చేపట్టిన పనులపై మంగళవారం గోకవరం ఎంపిడివో కార్యాలయం నందు18 వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 14 గ్రామపంచాయితీలలో జరిగిన పనులకు సామాజిక తనిఖీ డ్వామా పిడి ఎ. నాగమహేశ్వరరావు, ఎపిడి రాంప్రసాద్, జిల్లావిజిలెన్స్ అధికారిణి కె. రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో 894 పనులకు గాను 15.77 కోట్లు, పంచాయితీరాజ్ మెటీరియల్ పనులు 124 పనులకు గాను 9.28 కోట్లు, ఫారెస్టు 8 పనులకు గాను 11.35 లక్షలు పనులు నిర్వహించినట్లు తెలిపారు. 01.04.2024 నుండి 31.03.2025 వరకు ఉపాధి హామి మరియు పంచాయితీరాజ్ మెటీరియల్ పనులలో రూ 1,03,507/-(ఒక లక్ష మూడు వేల ఐదు వందల ఏడు రూపాయలు) రికవరికి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో యం. గోవిందు, ఎఒ శ్రీనివాసరావు, ఎపిఒ పి. యస్. అప్పలరాజు, యస్. ఆర్. పి కె. వెంకటరమణ, మండల ఇంజనీరింగ్ అధికారులు సామాజిక తనిఖీ సిబ్బంది, ఉపాధి సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**విశ్వాసాన్ని కోల్పోయిన సామాజిక తనిఖీలు:--**

ఇదిలా ఉండగా గత సంవత్సరం సుమారు లక్షల 70 వేల రూపాయలు పనిచేస్తున్న సిబ్బంది కొత్తపల్లి గ్రామంలో వెయ్యని చెయ్యని పనులకు చేసినట్లు నిధులు దోచుకోవడం పై గత సామాజిక తనిఖీలు రికవరీ ఆదేశించగా నేటికీ ఒక్క రూపాయి కూడా రికవరీ చేయకపోవడం పై పలువురు అధికారులను విమర్శిస్తున్నారు. గత ఫిబ్రవరి నెలలో రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారం సంబంధిత వ్యక్తి వేతనం నుండి రికవరీ చేయడం జరుగుతుందని నోటీసులు జారీ చేసిన కనీసం పట్టించుకోకపోవడం పట్ల ఇక్కడ అధికారులు చిత్తశుద్ధిని ప్రజల ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా ఇలాంటి సామాజిక తనిఖీలు కారణంగా ప్రయోజనం లేదని సంవత్సరకాలమైనా రూపాయి రికవరీ చేయలేని అధికారులు ఇలాంటి సామాజిక తనిఖీలు ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# బిసిటీ తరపున 12 మందికి

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 24:**కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 1వ డివిజన్ నారాయణపురం వాంబే గృహాల వద్ద నగర పాలక సంస్థ చేపట్టిన ఆక్రమణల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన 12 మందికి

కుటుంబ అవసరాల నిమిత్తం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున (బిసిటీ) ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధి ప్రజల ప్రయోజనాల కోసం జరుగుతున్నప్పటికీ, వాటి వల్ల ఇబ్బందులు పడుతున్న పేదలను ప్రభుత్వం , తమ ట్రస్ట్ ఆదుకుంటామని చెప్పారు. ఉపాధి కోల్పోయిన జీవనోపాధి కల్పించేందుకు సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాజవోలు గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 24:**పాడి పరిశ్రమను పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రూరల్ మండలం రాజవోలు గ్రామంలో పశు సంవర్ధక శాఖ మార్కెట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏ.ఎం.సీ చైర్మన్ మార్ని వాసుదేవ్ అధ్యక్షతన ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భకోశ వ్యాధుల గల పశువులకు ఉచిత గర్భధారణ పరీక్షలు ఉచిత మందుల పంపిణీ ని ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ , పశువులకు పశు భీమా 50 శాతం సబ్సిడీ పై పశుదాణ ఏర్పాటు చేశామని, నాణ్యమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. గొర్రెలకు ఏప్రియల్ నెలలో నట్టల నివారణ మందుల పంపిణీ , ఈ నెలలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు జరుగుతుందని రైతులు వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో లింగ సార్టెడ్ సెమన్ కేవలం పెయ్యి దూడలు జన్మించే వీర్యకణాల నాళికలను రైతులకు అందుబాటులోఉంచామని , రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ మార్ని వాసుదేవ్ మాట్లాడుతూ పశువులలో కృత్రిమ గర్భధారణ అమలు జరపాలని ప్రభుత్వం చొరవ తీసుకోవాలని పశువులలో రోగ నిర్ధారణ పరీక్షల ల్యాబ్ ను కడియంలో నిర్మించటానికి ఎమ్మెల్యే కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర స్థాయి ఒంగోలు ఆవుల పాల పోటీల్లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్న రాజవోలు గ్రామానికి చెందిన రిమ్మలపూడి శ్రీనివాస రావును సన్మానించారు. అనంతరం పాడి రైతులకు ఎమ్మెల్యే గోరంట్ల మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నిమ్మలపూడి రామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గంగిన జాహ్నవి, బైరెత్తి సరోజినీ దేవి, మండ హిమబిందు, బండి శ్రీ జ్యోతి, మామిడిశెట్టి సువర్ణ కుమారి, మట్ట శ్రీను, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా. జి. రవి వర్మ, ప్రాంతీయ పశు వైద్యశాల, డా. పి. వెంకట రావు, డా. జె.ఎస్.ఆర్.ఆర్. కిరణ్-వి.డి, డా.బి. భారత్-వి.డి, డా. కె. సౌమ్య- వి.డి, వల్లేపల్లి శ్రీరామ్ చౌదరి, గాలి వెంకటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఇటు ఆక్రమణలు..అటు చెత్త





**ఏలూరు మార్చి 24 పెన్ పవర్ :**ఏలూరు పట్టణం 18వ డివిజన్ గొల్లాయి గూడెం రాజీవ్ గృహకల్ప కాలనీ ఓహెచ్ఆర్ నుండి,వంగాయ గూడెం అంబేద్కర్ సెంటర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రధాన రహదారి ఆక్రమణలకు గురౌతోంది.రహదారికి ఇరువైపులా ఆక్రమించి డ్రైయిన్‌లపై శాశ్వత ఇళ్లను కట్టడంతో పాటు మట్టితో పూడ్చుకుంటూ మరింత ముందుకు వచ్చేస్తున్నారు.ఇంత జరుగుతున్నా కార్పోరేషన్ అధికారులు,ఇరిగేషన్ ,డ్రైనేజీ,స్దానిక నాయకులు పట్టించుకోకపోవడం కొసమెరుపు.ఇరిగేషన్ డ్రెయిను పడమటి లాకుల నుంచి జాలిపూడి మీదుగా 12 కిలోమీటర్లు ప్రవహించి కొల్లేరులో కలుస్తోంది.4వేల ఆయకట్టుకు ఇదే ఆధారం.ఏటా తమ్మిలేరు నుండి పడమటి లాకులు నుండి పెద్ద ఎత్తున వస్తున్న నీటిని మోసుకు పోవడానికి ఇదే ప్రధాన డ్రెయిన్.ఇష్టారాజ్యంగా చెత్తా చెదారాన్ని డ్రెయిన్ దెబ్బతినే ప్రమాదం కనిపిస్తోంది.ముఖ్యంగా ప్రధాన రహదారికి ఇరువైపులా పాత సామాన్ల స్క్రాప్ దుకాణాలు,హొటళ్లు,రసాయనాలతో కూడిన నీరు, ఇతర వ్యర్ధాలను నేరుగా డ్రయిన్‌లోకి డంప్ చేయడం వల్ల డ్రెయిన్ కుచించుకు పోతొంది.డ్రెయిన్ బాగు చేసేందుకు వీల్లేనంత స్దాయిలో ఆక్రమణలు పెరిగిపోయాయి.ఆక్రమణలు,చెత్తతో డ్రెయిన్లో తూడు పెరిగిపోయి మురుగు నీరు కిందకు పారక పోవడంతో పైన ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు.చిన్న వర్షానికే కాలనీలోని రోడ్లపై చేరి తటాకాన్ని తలపిస్తోంది.ముక్కు పుటాలు అదిరిపోయే దుర్గంధం వెదజల్లుతున్న నీరు డ్రెయిన్‌లో ఎక్కడి కక్కడే నిల్వ ఉండటంతో మలేరియా,డెంగీలాంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.దీనిపై సంభందిత అధికారులు ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వేసవి లో లోవోల్టేజీ సమస్య లేకుండా ఆధునీకరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 24 :**వేసవి దృష్టిలో ఉంచుకుని లో వోల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ లైన్లను ఆధునికరణ చేస్తున్నామని, పుష్కరాల నాటికి మరికొన్ని సబ్ స్టేషన్లు నిర్మిస్తామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మంగళవారం ధవలేశ్వరం, హుకుంపేట గ్రామాల్లో పలు సమస్యలను ఎమ్మెల్యే గోరంట్ల పరిశీలించి స్థానికుల అభిప్రాయా లను అడిగి తెలుసుకున్నారు. ధవలేశ్వరం గ్రామంలో లక్ష్మీ నరసింహ కాలనీ వద్ద నూతన సబ్ స్టేషన్ నిర్మించేందుకు స్థలాన్ని రెవెన్యూ విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. . సబ్ స్టేషన్ నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయని త్వరితగతిన సబ్ స్టేషన్ పూర్తి చేసేందుకు కృషి చేస్తానని గోరంట్ల తెలిపారు. హుకుంపేట పంచాయతీ ఎమ్మార్వో కాలనీ నందు డ్రైనేజీ సమస్యను స్థానికులతో కలిసి పరిశీలించి డ్రైనేజీ నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్థానికులతో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రెండు నెలల్లో డ్రైనేజీ నిర్మాణం పూర్తవుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, ఎమ్మార్వో శ్రీనివాస్, ఏఈ శ్రీనుబాబు, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, పుక్కళ్ల రాజు, ఆళ్ల ఆనందరావు, కురసాల ప్రసాద్, బత్తిన ఏడుకొండలు, ఇళ్ల రాంబాబు, నళ్ళ రమేష్, గుబ్బల దశరథ్, పంపన శ్రీను, ఆళ్ల విటల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.ద

## రాష్ట్ర స్థాయి సాప్ లీగ్ స్పోర్ట్స్ 2026 100మీటర్లు, 400 మీటర్లు సాఫి అథ్లెటిక్ కు గోళ్లపల్లి రామారావు ఎంపిక





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 24:**ఈ పోటీలను డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ డెవలప్మెంట్ ఆఫీసర్ ఆఫీసర్(డీఎస్ డి ఓ )షేక్ అజీజ్ ప్రారంభించారు. 100మీటర్లు, 400మీటర్లు సాఫి అథ్లెటిక్ లీగ్ ఏలూరు(ఎ ఎస్ ఆర్) స్టేడియం లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానం సాధించి ఈ నెల 30, 31 తేదీలలో గుంటూరు అను స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బొమ్మిడి స్కూల్ కి చెందిన గొల్లపల్లి రామారావు వెల్లి ఆడతారు. మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేశ్వరావు ఉపాద్యాయులు పాల్గొన్నారు.

# పుష్ కర్ట్స్ పంపిణీ



**వై రామవరం, పెన్ పవర్,మార్చ్ 24** : స్వచ్ఛ ఆంధ్ర , స్వర్ణాంధ్రలో భాగంగా పుష్ కర్ట్స్ పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

మంగళవారం 17 పంచాయతీలకు స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా పుష్ కర్ట్స్, మూడు రకాల డస్ట్ బిన్ లు ప్రజాప్రతినిధులతో ఆయా పంచాయతీలో సర్పంచులకు, పంచాయతీ అభివృద్ధి అధికారులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచులు పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారని తెలిపారు.

## గుమ్మలదొడ్డి వెంకటేశ్వర స్వామి ఆలయనికి ఆర్వో ప్లాంట్ వితరణ చేసిన అస్సాగో ఇండస్ట్రీస్






- అస్సాగో ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ వి కె శుక్లా
- చేతుల మీదుగా ప్రారంభం

**గోకవరం పెన్ పవర్ మార్చి 24:**– గుమ్మలదొడ్డి గ్రామం లో ప్రసిద్ధిగాంచిన వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రతి శనివారం అనేక మంది భక్తజనం స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వస్తారని వచ్చే భక్త జనానికి దాహం తీర్చేందుకు ఆలయ కమిటీ 2023లో అస్సాగో ఇండస్ట్రీస్ వారిని ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ కోరడం జరిగింది. ఈ విషయమై అస్సగో యాజమాన్యం సానుకూలంగా స్పందించి ఆర్వో ను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఈమధ్యకాలంలో ఆర్వో ప్లాంట్ సరిగ్గా పని చేయక రిపేరు కావడంతో ఉప సర్పంచ్ అబ్బి రెడ్డి చిన్ని మరియు ఆలయ కమిటీ చైర్మన్ వెంకన్న అస్సాగో యాజమాన్యం వారి దృష్టికి తీసుకురావడం తో మరల అస్సాగో ఇండస్ట్రీస్ యాజమాన్యం భక్తుల దాహం తీర్చేందుకు సుమారు లక్షా 25 వేల రూపాయలను వెచ్చించి కొత్త ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేసి వైస్ ప్రెసిడెంట్ వి కే శుక్లా చేతుల మీదగా ఈరోజు ప్రారంభించడం జరిగిందని ఆలయ కమిటీ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వెంకన్న మాట్లాడుతూ యాజమాన్యం తెలియ జేయడంతో వెంటనే వారి స్పందించి వచ్చే భక్తులు దాహంతో ఉండకూడదని 1.25 వేల రూపాయలతో త్రాగునీటిని అందించిన అస్సాగో యాజమాన్యాన్ని అభినందిస్తూ వారి పట్ల హర్షం వ్యక్తం చేయడం జరిగింది. వైస్ ప్రెసిడెంట్ వీక్ శుక్లా మాట్లాడుతూ మా సంస్థ ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు మా ద్వారా చేయిస్తున్న అస్సాగో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ గురునానికి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకన్న,ఆలయ కమిటీ సభ్యులు, అస్సాగో ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ వీ కే శుక్లా సెక్యూరిటీ ఆఫీసర్ భవాని శంకర్,గ్రామ పెద్దలు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో చిన్నారులకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఐసీడీఎస్ పి.ఓ అవగాహన కార్యక్రమం....





**అడ్డతీగల , పెన్ పవర్, మార్చ్ 24:**
వేసవి కాలంలో చిన్నారులు ఎండ తీవ్రతకు గురికాకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని అడ్డతీగల ఐసిడీస్ సిడిపివో క్రాంతికుమారి అంగన్వాడి కార్యకర్తలకు సూచించారు.
అడ్డతీగల మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం అంగన్వాడి కార్యకర్తలకు 'వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు' అనే అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సుందరి, అరుణలత, బాపనమ్మ, స్వర్ణలతలు పాల్గొన్నారు.
అడ్డతీగల, వైరావరం మండలాలకు చెందిన అంగన్వాడి కార్యకర్తలు భారీ సంఖ్యలో ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, వేసవి ఎండల్లో పిల్లల ఆరోగ్య రక్షణ, జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై వివరాలు తెలుసుకున్నారు.
సిడిపివో క్రాంతికుమారి మాట్లాడుతూ, "వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల చిన్నారులు డీహైడ్రేషన్, హీట్ స్ట్రోక్ వంటి సమస్యలకు గురవుతారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు తగినంత నీరు అందించడం, ఎండలో బయటకు తీసుకెళ్లకపోవడం, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలి" అని సూచించారు.
ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా అంగన్వాడి కార్యకర్తలు మరింత సమర్థవంతంగా వేసవి కాలంలో పిల్లల రక్షణకు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు

## నిర్వాసిత ప్రాంతాల్లో పర్యటించాలి -- సిపిఎం డిమాండ్




**సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 24** : పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జల వనరుల ముఖ్య కార్యదర్శి కాంతారావు నిర్వాసిత ప్రాంతాల్లో పర్యటించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం డిమాండ్ చేశారు.మంగళవారం రంపచోడవరం సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ అధ్యక్షతన పోలవరం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో జీవనాధారాలు కోల్పోయిన నిర్వాసితుల గ్రామాలను అధికారులు ప్రత్యక్షంగా సందర్శించి సమస్యలను అర్థం చేసుకోవాలని కోరారు.నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ప్రాజెక్టు పనులు కొనసాగించడం సరికాదని ఆయన అన్నారు. 2020--22 మధ్య అనేక గ్రామాలు ముంపుకు గురైన నేపథ్యంలో నిర్వాసితులకు న్యాయం చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు ఇచ్చినప్పటికీ అవి అమలు కాలేదని విమర్శించారు. కాంటూరు లెక్కల పేరుతో కొంతమందికి మాత్రమే పరిహారం ఇచ్చి, మిగిలిన వారిని విస్మరించడం అన్యాయమన్నారు.
ప్రభుత్వం నిర్మించిన కాలనీలు నాసిరకంగా ఉండి నివాసయోగ్యంగా లేవని, తాగునీరు, విద్య, వైద్యం, పాఠశాలలు, అంగనవాడి కేంద్రాలు వంటి కనీస మౌలిక వసతులు సరిగా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిష్కరించాల్సిన సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.పోలవరం జాతీయ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో విడుదల చేయాలని, ప్రాజెక్టు వ్యయం పెరిగిన నేపథ్యంలో తగిన సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి ప్యాకేజీలు అందించాలని, నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఎం పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కార్యదర్శి వర్గ సభ్యులు మట్ల వాణిశ్రీతో పాటు పలువురు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పంచాయతీ అభివృద్ధి పై శిక్షణ తరగతి...







**-గ్రామ అభివృద్ధికి కృషిచేసిన సర్పంచులను కొనియాడారు**

**కూనవరం,పెన్ పవర్,మార్చి 24.**పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవో ఆశీర్వాదం ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ తరగతిని మంగళవారం నాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించారు.పంచాయతీ అభివృద్ధి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ పాయం రంగమ్మ,ఎంపీటీసీలు, మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల సర్పంచులు,ఎస్ హెచ్ జి మెంబర్లు,మండల స్థాయి అధికారులు,డిప్యూటీ ఎంపీడీవో ఎంవిఎస్ఎస్ జగన్నాధరావు,ఎం విఎస్ ప్రసాద్,పంచాయతీ కార్యదర్శులు,డిజిటల్ అసిస్టెంట్లు మరియు మండల పరిషత్ సిబ్బంది శిక్షణ తరగతులలో పాల్గొన్నారు. సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నందున సర్పంచ్ లను దుస్సాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎంపీపీ పాయం రంగమ్మ మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధికి సర్పంచులు ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు.

# భవనాలనిర్మాణాలు పూర్తి కాక చిన్నారులకు అవస్థలు

-నిధులున్నా పట్టించుకోని వైనం



**ఏలూరు మార్చి 24 పెన్ పవర్ :** దెందులూరు నియోజక వర్గం అంగన్ వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు లేక చిన్నారులు,గర్భిణలు,బాలింతలు,అంగన్ వాడీ కార్యకర్తలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.దెందులూరు మండలంలో 79 అంగన్ వాడీకేంద్రాలున్నాయి.దెందులూరు సెక్టార్-1లో 28 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి.సెక్టార్-2 పరిధిలో 28 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి.మిగిలినవి రెంట్ ఫ్రీ,అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో మండల కేంద్రం దెందులూరుకు కూతవేటు దూరంలో ఉన్న సానిగూడెం గ్రామంలో అంగన్ వాడీ భవన నిర్మాణం ప్రారంభించి 4 ఏళ్ల దాటింది.నిర్మాణం స్లాబ్ దశలోనిలిచిపోయింది.
సెక్టార్‌లలో కొన్న కేంద్రాలలో సహాయకులు లేక టీచర్లే వండిపెడుతున్నారు.మరో పక్కవిద్యాబోధన,గర్భిణులకు,బాలింతలకు,పోషకాహారపంపిణీ,చిన్నారులకు వంట చేసి పెడుతున్నారు.కూటమి ప్రభుత్వం మండలంలో నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని చిన్నారుల తల్లి తండ్రులు కొరుతున్నారు

# మావోయిస్టు అగ్రనేత పాపారావుతో పాటు 18 మంది మెయిన్‌స్ట్రీమ్‌లోకి

బస్తర్‌లో భారీ లొంగుబాటు






**చింతూరు, పెన్ పవర్ మార్చి 24:**బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమానికి గట్టి దెబ్బ తగిలింది. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌చార్జ్ పాపారావు 17 మంది ఇతర మావోయిస్టు క్యాడర్లతో కలిసి ప్రభుత్వానికి లొంగుబాటయ్యాడు. మొత్తం 18 మంది లొంగిపోయిన వారిలో 7 మంది మహిళా క్యాడర్లు ఉన్నారు. ఈ లొంగుబాటు కార్యక్రమంలో డివిసిఎం సభ్యులు ప్రకాశ్ మడవి, అనిల్ తాటి కూడా ఉన్నారు. వీరంతా హింసా మార్గాన్ని విడిచి శాంతియుత జీవితం గడపాలని సంకల్పంతో ముందుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. లొంగుబాటు ప్రక్రియలో భాగంగా వీరు ఏకే 47 తుపాకులు సహా ఇతర ఆయుధాలను కూడా అప్పగించనున్నారు. మార్చి 24న జరిగిన ఈ పరిణామం నక్సల్ రహిత బస్తర్ లక్ష్య సాధన దిశగా కీలక విజయంగా భావిస్తున్నారు. దండకారణ్య ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఇదే మొదటిసారి నక్సల్ సంస్థ నాయకత్వం దాదాపు లేకుండా పోయిందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుసరించి బస్తర్ ప్రాంతం కొత్త ఉత్సాహంతో, సానుకూల దిశగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకా మిగిలి ఉన్న కొద్దిమంది మావోయిస్టులు కూడా చిన్న చిన్న గుంపులుగా తిరుగుతూ ఉండగా, వారు కూడా త్వరలో శాంతి మార్గాన్ని ఎంచుకుని ప్రధాన ప్రవాహంలో చేరతారని అధికారులు ఆశిస్తున్నారు. లొంగుబాటు చేసిన ఈ 18 మంది క్యాడర్లకు సంబంధించి పునరావాస ప్రక్రియ త్వరలోనే పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ విషయంపై మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు తెలిపారు.

# ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ




**చింతూరు, పెన్ పవర్ మార్చి 24:** ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని సాపిడ్ సేవా సంస్థ మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చింతూరు జెడ్‌పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. తులసీపాక వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్ పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ చింతూరు డిప్యూటీ వైద్య ఆరోగ్య కార్యాలయం నుంచి మెడికల్ కాలనీ, సీపీఎం కార్యాలయం, ప్రధాన కేంద్రం మీదుగా తిరిగి డిప్యూటీ కార్యాలయం వరకు సాగింది. ర్యాలీ సందర్భంగా విద్యార్థులు క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కలిగించేలా నినాదాలు చేశారు. వ్యాధి లక్షణాలు, వ్యాప్తి కారణాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ టీబీ అంతం మన పంతం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, అలసట, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారిని క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గుర్తించి వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి పరీక్షలు చేయించి చికిత్స ప్రారంభించాలని సూచించారు. అలాగే సమాజం నుంచి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. జనవరి 2026 నుంచి ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో 41 క్షయ కేసులు నమోదయ్యాయని తెలిపారు. క్షయ రోగులకు పోషకాహారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి నెల వెయ్యి రూపాయలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందని వివరించారు.
ఈ కార్యక్రమంలో సాపిడ్ సంస్థ ప్రతినిధి అహ్మద్ అలీ, సీనియర్ చికిత్స పర్యవేక్షకుడు రామాంజనేయులు, ఎంపీహెచ్ఈఓ రాంప్రసాద్, తులసీపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# లయన్స్ గవర్నర్ చే సేవ కార్యక్రమాలు






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 24.**లయన్స్ గవర్నర్ అఫీషియల్
గవర్నర్ గని నిట్ కాలేజ్ వద్ద రిసీవ్ చేసుకోనా తాడేపల్లిగూడెం స్పిరిట్ లయన్స్ క్లబ్.ప్రెసిడెంట్, పెదప్రోలు భాస్కర్ అడ్డు రంజిత్,
ఆంగ్లో ఇండియన్ కాన్వెంట్ దగ్గర పర్మినెంట్ ప్రాజెక్టు లయన్స్ చిల్డ్రన్స్ పార్క్ విజిటింగ్ చేశారు. రవి మాధవ్ నర్సింగ్ హోమ్ నందు 89 మంది పేషంట్ తో డాక్టర్ చిట్యాల సురేంద్ర కుమార్ డాక్టర్ పద్మిని సౌజన్యంతో హెచ్ బిసి టెస్ట్, లంగ్ ఫంక్షన్ టెస్ట్ ప్రోగ్రాం చేశారు. నూకలు నాగమల్లేశ్వరరావు, జయ భారత్ ఎటెక్ కంప్యూటర్స్ నందు 36 మంది విద్యార్థులకు, సర్టిఫికెట్స్ డిస్ట్రిబ్యూషన్. ఈ సంవత్సరం 650 మంది లైన్ స్టిక్ ఇయర్ లో కంప్యూటర్ విద్యను అభ్యసించారు. పడాల గోశాల నందు నూకల నాగమల్లేశ్వరరావు, వట్టిపోలు రాము సౌజన్యంతో దానా పంపిణీ చేశారు. పడాల వృద్ధాశ్రమము నందు 60 మంది వృద్ధులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అధ్యక్షులు పెదప్రోలు భాస్కర్, ట్రెజరర్ అప్పన్న వెంకట సత్య రమేష్ కుమార్ సౌజన్యంతో ఐ ఎమ్ ఐ హాలు నందు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మీటింగ్, గవర్నర్ అఫీషియల్ విసిటేషన్ తాడేపల్లిగూడెం అధ్యక్షులు పెదప్రోలు భాస్కర్ అధ్యక్షతన, ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ 316జి గవర్నర్ పాపారావు నాయుడు, మాజీ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, డిసిఎస్ కామేశ్వర రావు, డిసిటీరామలింగేశ్వర రావు, రీజనల్ చైర్ పర్సన్ సుంకర శ్రీనివాస్, సెక్రటరీ అడ్డు రంజిత్, ట్రెజరర్ అప్పన్న వెంకట సత్య రమేష్ కుమార్, డిస్టిక్ చైర్ పర్సన్స్ నూకలు నాగమల్లేశ్వరరావు, వట్టిపోలు రామసత్య కృష్ణారావు, బత్తుల ప్రసాద్ , డాక్టర్ చిట్యాల సురేంద్ర కుమార్ , డాక్టర్ నార్ని భావాజీ, డాక్టర్ విటల్ ప్రసాద్ ,ఉపాధ్యక్షులు మణికంఠ, ఎస్ ఎస్ రమేష్, ఎల్ సత్యనారాయణ , పలివెల ఏకాంబరేశ్వర రావు, వీర వెంకయ్య ,ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, వివిధ తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధినివారణ పై అవగాహనా సదస్సు




**అంబాజీపేట పెన్ పవర్, మార్చి 24:**ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో క్షయ వ్యాధి నివారణ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. . ఈ కార్యక్రమం లో వైద్యాధికారి వి. గౌతమి మాట్లాడుతూ రెండు వారాలు మించి దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రెండు వారాలు మించి జ్వరం, కళ్ళే లో రక్తం పడడం , టిబి వ్యాధి లక్షణాలు గా గుర్తించి అందరూ ముందుగా కళ్ళే పరీక్ష చేయుశీచు కోవడం ద్వారా వ్యాధి నీ ముందుగానే గుర్తించి ఆరు నెలలు ట్రీట్మెంట్ తీసుకోవడం ద్వారా రోగికి పూర్తిగా నయం అవుతుందని ఈ ట్రీట్మెంట్ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా లభిస్తుందని తెలియజేసినారు. అనమతరమ టిబి నివారణ ప్రతిజ్ఞ చేయుశీచుట జరిగింది. టిబి ముక్తా భారత్ విలేజ్ లుగా మండలం లో జి. అగ్రహారం, గంగలకుర్రు, తొండవరం, వాకలగరువు, వక్కలంక, కౌముజు వారిలంక, పసుపల్లి, ముక్కామల గుర్తింపు లభించిందని తెలియజేసారు. వైద్యాధికారి డా.కె.ఎన్.శ్రీనివాస్ ఎంఎల్ హెచ్ ప్రసాద్ కి టిబి ముక్తా భారత్ అవార్డులు లు అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వర రావు ఎంపి.డి.ఓ. బి. మమత ఎమ్ ఈఓలు మోకా ప్రకాష్ రావు కె. వెంకటేశ్వర రావు, డిప్యూటీ ఎంపిడివో లు కంచి శ్రీనివాస్ , అబ్బాస్ , సూపర్ వైజర్ రాధా నరసింహం, పిఎన్ భూలక్ష్మి ముక్కామల పిహెచ్ సి రవి కుమార్ సచివాలయం పరిధిలో నున్న వెల్ఫేర్ సెక్రటరీ లు, పంచాయతీ కార్యదర్శి లు, డ్వాక్రా యానిమేటర్స్ పాల్గొన్నారు.

# పల్లె నిద్రతో ప్రజలకు మరింత భరోసా







ఎస్సై డి. రామ్ కూమార్

**సీతానగరం, పెన్ పవర్, మార్చి24:**గ్రామాలు, వార్డుల్లో పోలీసులు నిర్వహిస్తున్న పల్లెనిద్ర కార్యక్రమంతో ప్రజలకు మరింత భరోసా కల్పిస్తున్నామని ఎస్సై డి. రామ్ కూమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ నార్త్ డి.ఎస్.పి రామకృష్ణ కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వి.వి. ఎస్ మూర్తి పర్యవేక్షణలో
మంగళవారం రాత్రి సీతానగరం మండలంలోని పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు, గ్రామాల కానిస్టేబుళు 'పల్లె నిద్ర' కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పల్లె నిద్ర కార్యక్రమంతో ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని కలిగిస్తున్నామన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల సహకారంతో పోలీసింగ్ను మరింత బలోపేతం చేయడమే పల్లె నిద్ర ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు పెద్ద నేరాలుగాను, శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశముందని, ఇలాంటి అంశాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, చర్యలు చేపడు తున్నామన్నారు. పోలీసు స్టేషన్లకు వెళ్ళకుండానే వారి సమస్యలను నేరుగా పోలీసు అధికారులకు తెలిపేందుకు 'పల్లెనిద్ర' ఒక వేదికగా నిలుస్తుంద న్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విషయాలను, గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల మధ్యగల విభేదాలను, భూతగాదాలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసేందుకు, ప్రజలకు రక్షణగా నిలిచే చట్టాలు, సైబర్ మోసాలు, మహిళలు, రహదారి భద్రతపట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.

# పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఇందుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ.



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 24:**ఉమ్మడి తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల సబ్ జూనియర్స్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ కాంపిటీషన్ మెన్ అండ్ ఉమెన్ పోటీల్లో అమలాపురం మండలం ఇందుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సబ్ జూనియర్స్ విభాగంలో సిహెచ్ సత్య గోపాలం (9వ తరగతి) బెంజ్ స్కాడ్ 110 బెంచ్ ప్రెస్ 45 డెడ్ లిఫ్ట్ 120 మొత్తం 270 కేజీలు, వి బాలాజీ బెంచ్ స్కాడ్ 70, బెంచ్ ప్రెస్ 30 డెడ్ లిఫ్ట్ 90 మొత్తం 190 కేజీలు బరువు ఎత్తి మూడవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయుని లంకరాణి, సర్పంచ్ శివాలిని అప్పాజీ ఎస్ఎంసి చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అందరూ విజయం సాధించిన విద్యార్థులను, ఆ విద్యార్థులకు మంచి తర్ఫీదు నిచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వీరమల్లు నరసింహారావు (బుజ్జి) ను అభినందించినారు.

# పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక (జి పి డి పి) అమలు పై అవగాహన సమావేశం

ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్

**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 24:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక (జి పి డి పి) అమలు పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్‌పీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వి.ఓ.ఏలు స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరయ్యారు.ఈ సమావేశానికి ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయితీల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టిన పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక ( జిపి డి పి)గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు అవుతోందన్నారు.
ఈ ప్రణాళిక ద్వారా గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యతల ఆధారంగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సూచనలు సేకరించి, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం వంటి ప్రధాన రంగాలలో అభివృద్ధి కార్యక్రమాలురూపొందించబడుతున్నాయని అన్నారు.ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించడం వల్ల పారదర్శకత, బాధ్యత పెరుగుతాయని ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వి.ఓ.ఏలు మరియు స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.